

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



ఒక రోజు ముందే పెన్షన్లు

31నే అందించేందుకు ఏర్పాట్లు : కలెక్టర్

ఏలూరు సిటీ, ఆగస్టు 29: వచ్చే నెల ఒకటో తేదీ ఆదివారం రావడంతో ఒక రోజు ముందు ఆగస్టు 31నే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్ధిదారులకు అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. పెన్షన్ల పంపిణీపై గురువారం సంబంధిత అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 31వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచే పెన్షన్ల పంపిణీని ప్రారంభించి, అదే రోజు నూరు శాతం పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఏదైనా కారణాలతో పెన్షన్లు తీసుకోని వారికి సెప్టెంబరు 2న ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో 2,65,992 మంది పెన్షన్‌దారులకు రూ. 113.67 కోట్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఏ విధమైన పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు. డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, జడ్పీ సీఈవో కేవీఎస్ సుబ్బారావు, ఎల్డీఎం డి.నీలాద్రి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యార్జిత కల్యాణ సేవ రుసుం పెంపు

ద్వారకాతిరుమల, ఆగస్టు 29: శ్రీవారి నిత్యార్జిత కల్యాణ సేవా టికెట్టు రుసుమును రూ.1,500 నుంచి రూ.2 వేలకు పెంచుతూ దేవస్థానం నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఇది అమలులోకి వస్తుందని ఆలయ ఈవో త్రినాథరావు తెలిపారు. పెరిగిన రుసుముకు అనుగుణంగా టికెట్టు తీసుకున్న వారికి అదనంగా ఇచ్చే సౌకర్యాలు ఏమీ లేవు. కొన్నాళ్ల క్రితం అష్టోత్తరంతోపాటు మరికొన్ని ఆర్జిత సేవా టికెట్ల రుసుమును పెంచడంతో సామాన్య భక్తులు ఆవేదన చెందుతున్నారు.



క్రీడా పురస్కారాలు అందుకున్న ప్రధానోపాధ్యాయులతో డీఈవో అబ్రహం

ఐదు హైస్కూళ్లకు క్రీడా దినోత్సవ పురస్కారాలు అందజేత

ఏలూరు అర్బన్, ఆగస్టు 29 : హాకీ లెజెండ్ దివంగత ధ్యాన్‌చంద్ పుట్టినరోజును పురస్కరించుకుని జిల్లాలో ఉత్తమ క్రీడా ప్రతిభ కనబరిచిన ఐదు ఉన్నత పాఠశాలలను 'స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్-2024' అవార్డులకు ఎంపిక చేసినట్టు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. పెదవేగి ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర ఉన్నత పాఠశాల, ఏలూరు సెయింట్ థెరిస్సా బాలికోన్నత పాఠశాల, ఏలూరు కస్తూరిబా మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, వట్లూరు ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూలు, పోణంగి జడ్పీ హైస్కూలును పురస్కారాలకు ఎంపిక చేశామన్నారు. గురువారం డీఈవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పాఠశాలల హెచ్ఎంలు, వ్యాయామోపాధ్యాయులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేసి, దుశ్శాలువాలతో సత్కరించామని వివరించారు.

పోలవరానికి నిధులు.. సీఎం కృషి : ఎంపీ మహేశ్

ఏలూరు టూ టౌన్, ఆగస్టు 29: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.12 వేల కోట్లు మంజూరు చేయడంపై ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. కాఫర్ డ్యాం, డయా ఫ్రం వాల్‌తో సహా పూర్తిస్థాయిలో గేట్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. పోలవరానికి అధిక నిధులు మంజూరు చేయించటంలో సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేశారన్నారు. ప్రధానమంత్రి, ఆర్థిక మంత్రి, జలశక్తి మంత్రులను పలుమార్లు కలిసి విన్నవించారన్నారు.

పోలవరం పూర్తి చేయడమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే బాలరాజు

పోలవరం ఆగస్టు 29 : పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.12,500 కోట్లను కేటాయిస్తూ కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్టును సత్వరం పూర్తి చేయడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పని చేస్తున్నారని అన్నారు. గురువారం కూటమి నాయకులతో కలిసి పోలవరం ప్రాజెక్టును పరిశీలించి, పనుల పురోగతిని ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఆర్అండ్ఆర్ నిర్వాసితుల సమస్యల పరిష్కారంపై పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాల్లో కూటమి నేతలు చర్చించారని, నిర్వాసితుల తరఫున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. పైడిపాక నిర్వాసితులు ఆర్అండ్ఆర్ పరిహారాలు అందలేదని ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు. వారి సమస్య పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు. బీజేపీ నాయకులు కరిబండి నాగరాజు, బొరగం వెంకటలక్ష్మి, కామిశెట్టి నాగరాజు, జనసేన నాయకులు కొణతాల ప్రసాద్, పాదం కృష్ణ, తెలగంశెట్టి రాము, అవినాష్ పాల్గొన్నారు.

అయితే మాకేంటి ?

- మంత్రి పార్థసారథి హెచ్చరించినా.. నూజివీడు ట్రిపుల్ ఐటీలో అదే భోజనం
- ఉడకని ఉప్మా, గుడ్లు.. తినలేక వదిలేసిన విద్యార్థులు
- తండ్రిగా నేనైతే నిర్వాహకులను కొట్టి అడిగేవాడిని
- భోజనం రుచి చూసి మంత్రి ఆగ్రహం
- కొనసాగుతున్న జ్వరాలు.. మరో 80 మందికి చికిత్స



వంటలు రుచి చూస్తున్న మంత్రి పార్థసారథి



భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడుగుతున్న జనసేన నాయకులు

'మీ బిడ్డలకు ఇదే రీతిన ఆహారం అందిస్తారా ? నా పిల్లలు ఇక్కడ చదువుతుంటే, ఒక తండ్రిగా కొట్టి మరీ వెళ్ళేవాడిని' అని నూజివీడు ట్రిపుల్ ఐటీ మెస్ నిర్వాహకులపై మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇక నుంచి నాణ్యమైన భోజనం అందజేయాలని గురువారం రాత్రి రెండు గంటల వరకు ఐఐఐటీ అధికారులు, మెస్ నిర్వాహకులతో సమీక్షించి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అయితే మాకేంటి అనుకున్నారో ఏమో.. మెస్ మెస్ నిర్వాహకులు విద్యార్థులకు అదే నాణ్యత లేని భోజనం, ఉడకని ఉప్మా, గుడ్లను శుక్రవారం అందించారు. వీటిని తినలేక విద్యార్థులు చాలామంది వదిలేశారు. మరోవైపు జ్వరాల తీవ్రత తగ్గలేదు. ఈ రోజు 80 మందికి చికిత్స చేశారు. మెయిన్‌లో

బ్యారన్ లైసెన్స్‌లకు దరఖాస్తు చేసుకోవాలి

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 29:వర్జీనియా పొగాకు 2024-25 కాలానికి బ్యారన్ లైసెన్సుల రెన్యువల్, కొత్త లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకోవాలని, పొగాకు వేలం నిర్వహణాధికారి జె.సురేంద్రకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే పొగాకు సీజన్‌కు ఒక్కో బ్యారన్‌కు 4125 కేజీలు కోటాగా ఇచ్చారు. ఒక్కో బ్యారన్‌కు 4.37 ఎకరాల భూమి ఉండలి. ఈ నెల 28 నుంచి అక్టోబరు 24 వరకూ దరఖాస్తులు తీసుకుంటున్నాం. రూ.100 పెనాల్టీతో అక్టోబరు 25 నుంచి నవంబరు 8 వరకు, రూ.400 పెనాల్టీతో అక్టోబరు 9 నుంచి 20 వరకూ స్వీకరిస్తాం. ఆ తర్వాత స్వీకరించం. నిబంధనలను పాటించి దరఖాస్తు చేసుకోవాలి' ఆయన సూచించారు.

వన మహోత్సవానికి వనరులేవీ

- మూడేళ్లుగా పాఠశాలల్లో ఎకో క్లబ్‌లకు నిధులు నిలిపివేత.. నేషనల్ గ్రీన్‌కోర్ క్లబ్‌లు నిర్వీర్యం

గతంలో జిల్లాలో సామాజిక అటవీ శాఖఆధ్వర్యంలో ఎంపిక చేసిన పట్టణాలు, గ్రామాల్లో నిర్వహించే నర్సరీ నుంచి వన మహోత్సవం, తదితర సామాజిక పర్యావరణ కార్యక్రమాలకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేసేవారు. ఇపుడు చాలాచోట్ల నర్సరీలు లేవు. దీంతో జిల్లాలోని 250 హైస్కూళ్ళ ప్రాంగణాలు, స్థానిక ఖాళీ ప్రదేశాల్లో శుక్ర, శనివారాల్లో మొక్కలు నాటడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



ఏలూరు అర్బన్, ఆగస్టు 29 : పచ్చని మొక్కలను నాటడం ద్వారా శుక్ర, శనివారాల్లో రెండు రోజులపాటు పాఠశాలలు, వాటి ప్రాంగణాలు, ఖాళీ స్థలాల్లో 'వన మహోత్సవం' పేరిట నిర్వహించ తలపెట్టిన బృహత్తర కార్యక్రమానికి ఒక్క రూపాయి కూడా విదల్చకుండా జరపాల్సి రావడంపై ఉపాధ్యాయ వర్గాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నానాటికీ తగ్గిపోతున్న అటవీ సంపదను, పచ్చదనాన్ని కాపాడుకోవడం ద్వారా పర్యావరణ సమతుల్యత లక్ష్యంగా వన మహోత్సవాన్ని ఉద్దేశించగా, మూడేళ్లుగా వైసీపీ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అటకెక్కించడం వల్ల దాదాపు కనుమరుగయ్యే స్థితికి చేరుకుంది. తాజాగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మళ్లీ వన మహోత్సవానికి కార్యాచరణను చేపట్టింది. మొక్కల సేకరణ, వాటిని పాఠశాలలకు తరలించడం, నాటడానికి అయ్యే కనీస ఖర్చులకు నిధులు విడుదల చేయకపోవడం గమనార్హం. గతంలో టీడీపీ ప్రభుత్వం పచ్చదనం, పర్యావరణ పరిరక్షణలపై విద్యార్థులను భాగస్వాములుగా చేస్తూ అన్ని పాఠశాలల్లో నేషనల్ గ్రీన్ కోర్ (ఎన్జీసీ) ఆధ్వర్యంలో ఎకో క్లబ్‌లను ఏర్పాటుచేసింది. వీటికి కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖ నుంచి ఒక్కో స్కూలు ఎకో క్లబ్‌కు ఏటా రూ.5 వేలు బ్యాంకు ఖాతాకు జమ చేసేవారు. ఈ నిధులతోనే ఏడాది పొడవునా స్కూలులో నీటి సంరక్షణ, వ్యర్థ పదార్థాల నిర్వహణ, మొక్కలు నాటడం, విద్యుత్ వృధాను అరికట్టడం వంటి బాధ్యతలతో ఆరు రకాల క్లబ్‌లను విద్యార్థులతో ఏర్పాటు చేశారు. ఏలూరు జిల్లాలో 250 ప్రభుత్వ హైస్కూళ్ళలో ఎకో క్లబ్‌లు వుండగా, జిల్లాస్థాయిలో ఎన్జీసీ కార్యకలాపాల నిర్వహణ, పర్యవేక్షణ నిమిత్తం ఓ కో-ఆర్డినేటర్, మరో పది మంది బయోలాజికల్ సైన్స్ టీచర్లు ఉన్నారు. వీరికి ఏటా పారితోషకంగా రూ.25 వేలు చెల్లిస్తుండగా, గత జగన్ ప్రభుత్వం మూడేళ్ళుగా నిలిపివేసింది. ఆ మేరకు ఎటువంటి బడ్జెట్ నిధులు లేకుండానే ప్లాంటేషన్ కార్యక్రమాలను నిర్వహించడానికి టీచర్లు ఆసక్తి కనబరచడం లేదు. ఒకవేళ ఈ కార్యక్రమాలను నిర్వహించి బిల్లులు పెట్టుకున్నా నిధులు రాకపోవడంతో మొక్కలు నాటే కార్యక్రమాలు పూర్తిగా మూలనపడ్డాయి. మరోవైపు జిల్లావ్యాప్తంగా వన మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించడానికి, వాటిని పర్యవేక్షించడానికి టీచర్లకు ఆన్ డ్యూటీ సౌకర్యాన్ని ఇవ్వకపోవడంతో ఎన్జీసీ కార్యకలాపాలు నిలిచిపోయాయి. వనమహోత్సవం నిర్వహణ నిమిత్తం గురువారం సాయంత్రం వరకు నిధులేవీ విడుదల కాలేదని ఎన్జీసీకి చెందిన ఓ ఉపాధ్యాయుడు వివరించారు. స్కూలు విధులు ముగిసిన తర్వాత మొక్కల కోసం ప్రయత్నించాల్సి ఉందని చెప్పడం కార్యక్రమ ఏర్పాట్లలో లొసుగులకు సంకేతమని భావించవచ్చు.

ఏలూరు జిల్లాలో లక్ష మొక్కలు నాటనున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి రవీంద్ర దామా తెలిపారు. నూజివీడులో శుక్రవారం వనమహోత్సవం నిర్వహించనున్న కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ పాల్గొంటున్నారని తెలిపారు.



రొయ్యలు అధరహో !

పెరిగిన ధరలు.. సాగు విస్తీర్ణం.. లాభాల బాటలో రైతులు

కలిదిండి, ఆగస్టు 29: రొయ్యల ధరలు పెరిగాయి. వైసీపీ పాలనలో గిట్టుబాటు ధర లేక కుదేలైన ఆక్వా రంగానికి ఎన్డీఏ ప్రభుత్వం రాకతో మంచి రోజులు వచ్చాయి. గతంలో పెట్టుబడి వ్యయం పెరిగి రొయ్య ధర పతనమవడంతో సాగు విస్తీర్ణం తగ్గింది. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వేల ఎకరాల సాగు పెరిగింది. ప్రస్తుతం 100 కౌంటు రొయ్య ధర రూ.260, 90 కౌంటు రూ.270, 80 కౌంటు రూ.280, 70 కౌంటు రూ.300, 60 కౌంటు రూ.320, 50 కౌంటు రూ.340, 30 కౌంటు రూ.470 వరకు పెరిగింది. 100 కౌంటుకు గతంలో పోలిస్తే రూ.80 పెరిగింది. మంచి ధర లభించడంతో రైతులు 100 కౌంటు రొయ్యలను పట్టుబడి చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 50 రోజుల్లోనే రొయ్యల ధరలు పెరగడంతోపాటు సాగు ఊపందుకుని లాభాల బాటలో పయనిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 'వాతావరణంలో మార్పులతో వైరస్ వ్యాప్తి, ఆక్సిజన్ కొరత సమస్యలతో సాగు దెబ్బతింది. ప్రస్తుతం రొయ్యకు గిట్టుబాటు ధర ఉన్నప్పటికీ అందుకు తగ్గ ఉత్పత్తి లేదు. దీంతో రొయ్య ధర పెరిగింది. రాబోయే రోజుల్లో గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంది' అంటూ వ్యాపారి వి.సత్యనారాయణ పేర్కొన్నారు.



ప్రత్యేక గిరిజన దర్బార్‌లో జేసీ, పీవో ధాత్రిరెడ్డి, ఎమ్మెల్యే బాలరాజు

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

- గిరిజన దర్బార్‌కు వినతుల వెల్లువ

బుట్టాయగూడెం, ఆగస్టు 29 : పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కారించాలని కోరుతూ గురువారం కెఆర్ పురం ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో పి.ధాత్రిరెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రత్యేక గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి వినతులు వెల్లువెత్తాయి. అందిన 200కుపైగా వినతుల్లో అత్యధికం నిర్వాసితుల సమస్యలపైనే ఉండటం విశేషం. భూములు కోల్పోయిన గిరిజనులకు భూమికి భూమి లేకుంటే నష్ట పరిహారం అందజేయాలని, కొండపోడు భూములకు, డి.నమూనా పట్టాలున్న భూములకు నష్టపరిహారం ఇవ్వాలని గిరిజనులు వినతి పత్రాలు అందజేశారు. 2017 నాటికి పెళ్లి అయిందనే కారణంతోనూ, గ్రామాల్లో లేరనే కారణంతో ప్యాకేజి నిలుపుదల చేసిన వారికి పరిహారం అందించాలని కోరారు. బెడదనూరు గిరిజనులకు చెందిన భూముల వివరాలు రికార్డుల్లో ఒకలా ఆన్‌లైన్‌లో మరోలా ఉన్నందున చింతలపూడి ఎత్తిపోతల పథకానికి సంబంధించి గిరిజనులకు నష్టపరిహారం అందడంలేదని పథకం పనులు ముందుకు సాగడం లేదని పొరపాట్లను సరిచేసి గిరిజనులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే బాలరాజు పీవోకు సూచించారు. నిర్వాసితులకు ఇచ్చిన భూములకు సంబంధించి స్థానిక గిరిజనులకు నిర్వాసితులకు మధ్య గొడవలు జరుగుతున్నందున సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని గిరిజనులు, నాయకులు కోరారు. భూములు ఇచ్చినా సరిహద్దులు చూపకపోవడంతో గొడవలు వస్తున్నాయి, పట్టాలు ఇచ్చినా భూములు ఎక్కడ ఉన్నాయో చూపలేదని వెంటనే భూములు చూపాలని గిరిజనులు జేసీ దృష్టికి తెచ్చారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు.

పత్తి సాగు ఆశాజనకం



వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో 15 వేల ఎకరాల్లో సాగు.. ప్రకృతి కరుణిస్తే గట్టెక్కినట్లే

కుక్కునూరు, ఆగస్టు 29 : ఏజెన్సీలో తెల్ల బంగారంగా పిలిచే పత్తి సాగు ఈ ఏడాది ఆశాజనకంగా ఉంది. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని గోదావరి ముంపులో లేని, పోడు భూములైన 15 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. గత ఏడాది సాగు చేసిన రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూశారు. పంట పూత, పిందె దశలో వున్న సమయంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. సెప్టెంబరు రెండో వారం నుంచి అక్టోబరు చివరి వరకు వర్షాలు లేక తడులు లేవు. ఫలితంగా పూత, పిందె రాలిపోయింది. ఈ క్రమంలో ఎకరానికి మూడు క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. ఇక రైతుల వద్ద పత్తి వున్న సమయంలో క్వింటా రూ.6 వేలు పలికింది. వారు పూర్తిగా అమ్మకాలు జరిపిన ధర రూ.7 వేలకు పైగా చేరింది. దీంతో ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు నష్టపోయారు. ఈ ఏడాది జూన్ నుంచి ఒక మోస్తారు వర్షాలు కురవడంతో రైతులు పత్తి గింజలు వేసి సాగును ఆరంభించారు. జూలైలో అధికంగా వర్షాలు కురవడంతో కలుపు పెరిగి మొక్కల ఎదుగుదల లోపించింది. పది రోజులుగా వర్షాలు కొంచెం తగ్గడంతో కలుపు మొక్కలు తొలగించి, చీడ పీడల నివారణకు మందులు పిచికారి చేస్తున్నారు. ప్రస్తుతం పత్తి సాగు ఆశాజనకంగా ఉంది. పూత, పిందె దశలో కొంత వరకు వర్షాలు పడితే పంటలో మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు.

ప్రకృతి కరుణిస్తే గట్టెక్కుతాం

మడకం వీరయ్య, రైతు, ఇసుకపాడు



- గత ఏడాది పత్తి సాగు చేసి పెట్టుబడులు రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది. రాబోయే కాలంలో ప్రకృతి కరుణించి అనుకూలంగా వర్షాలు కురిస్తే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. అప్పుల బారి నుంచి బయటపడే అవకాశం ఉంది.

చింతలపూడిని వీడని జ్వరాలు

- పట్టించుకోని వైద్య ఆరోగ్య శాఖ
- ప్రజలకు అవగాహన కల్పించలేదు
- ఇంటింటా సర్వే చేయలేదు

- వదలని కీళ్ల నొప్పులతో జనం విలవిల
- దీర్ఘకాలిక వ్యాధులుగా మారతాయన్న భయం

చింతలపూడి, ఆగస్టు 29 : చింతలపూడి నగర పంచాయతీలో జ్వరాల జోరు తగ్గడం లేదు. ఒక ఇంట్లో ఒకరికి వస్తే ఇంటిల్లిపాది జ్వరాల బారిన పడుతున్నారు. జ్వరాలు రెండు, మూడు రోజుల్లో తగ్గినా కాళ్ల వాపులు, కీళ్ల నొప్పులు నెల రోజులు గడుస్తున్నా తగ్గటం లేదు. ఏరియా ఆసుపత్రిలో వచ్చే రోగుల్లో జ్వర పీడితులే అధికంగా ఉన్నారు. జ్వరం లేకపోయినా వాపులతో నడవలేని పరిస్థితి. ఏ ఒక్కరిని పలకరించినా ఇదే ఆవేదన. సీజన్‌లో జ్వరాలు వచ్చినా నాలుగు, ఐదు రోజులు మాత్రమే ఉండేవి. కీళ్ల నొప్పులు, కాళ్ల వాపులు ఉండేవి ఎరుగం. ఇప్పుడు ఇవేం వాపులో అంటూ వాపోతున్నారు. కొందరికి ముఖంపై నల్లమచ్చలు వస్తున్నాయి. జ్వరం వచ్చిందని అడ్డగోలుగా యాంటీ బయోటిక్స్, పెయిన్ కిల్లర్ ట్యాబ్‌లెట్లు వాడటం మంచిది కాదని చెబుతున్నారు. జ్వరం తగ్గిన తరువాత ఆహారంపై నిర్లక్ష్యం చేయవద్దని డాక్టర్లు సలహా ఇస్తున్నట్లు రోగులు చెబుతున్నారు. కొందరికి 50 రోజులు దాటిన వారు ఈ వాపులతో బాధపడుతున్నారు. వైద్య ఆరోగ్య శాఖ సేవలు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నాయి. ఇన్ని రోజులు గడుస్తున్నా ఎక్కడా ప్రజలకు ఈ వ్యాధులపై అవగాహన కల్పించిన దాఖలాలు లేవు. ఇంటింటా సర్వే లేదు. ధైర్యం చెప్పే వారు లేక ఇవి దీర్ఘకాలిక రోగాలుగా మారుతాయా ? అన్న భయంతో రోగులు తల్లడిల్లుతున్నారు. రాత్రి అయితే వాపుల నుంచి వచ్చే నొప్పులకు నిద్ర కూడా పోనివ్వడం లేదు. మరోపక్క దోమల బెడద తీవ్రంగా ఉంది. గతంలో సీజనల్ వ్యాధులు వస్తున్నాయంటే ఆరోగ్య శాఖ, మున్సిపల్ శాఖలు అప్రమత్తంగా ఉండేవారు. నగర పంచాయతీలో ప్రతి వీధి శానిటేషన్, దోమల నివారణకు చర్యలు తీసుకునేవారు. ప్రస్తుతం నగర పంచాయతీలో ఈ సేవలు తక్కువగా ఉన్నాయి. అర్బన్ సెంటర్ వచ్చినా ఎక్కడా వారి సేవలు కనిపించడం లేదు. కేవలం కార్యాలయాలకే పరిమితమయ్యారు. దోమలు అరికట్టండి, పరిశుభ్రత పాటించండి అంటారే తప్ప వీధులు, ప్రధాన రోడ్లలో డ్రైనేజీ, వాటి ద్వారా వ్యాపించే దోమల నివారణకు చర్యలు కనిపించవు.



చింతలపూడి ప్రభుత్వాసుపత్రిలో జ్వర పీడితులు

దుమ్ము, కాలుష్యం బెడద

చింతలపూడిలో దుమ్ము, కాలుష్యం బెడద వేధిస్తోంది. మెయి న్‌రోడ్డుపై చెత్తను తొలగిస్తున్నా, దుమ్మును తుడవడం లేదు. వర్షం పడినప్పుడు ఇవి బురదగా మారుతోంది. ఎండ కాస్తే బురద దుమ్ముగా మారి వాహనదారులు, పాదచారులు, దుకాణదారులు ఇబ్బంది పడుతున్నారు. గంట సేపటికి ఈ దుమ్మంతా ఒంటిపై పేరుకుపోతున్నట్టు కనిపిస్తోందని వ్యాపారులు చెబుతున్నారు. ఈ కారణంగా దగ్గు, జలుబు, తుమ్ములతో ఇబ్బంది పడుతున్నట్లు వాపోయారు. అయినప్పటికి నగర పంచాయతీ అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదు.

డీసీఎంఎస్‌కు పూర్వ వైభవం

ఐదేళ్లలో నిర్వీర్యమైన సహకార రంగం

భారీగా తగ్గిన వ్యాపార కార్యకలాపాలు

కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ ప్రోత్సాహం

ఏలూరుసిటీ, ఆగస్టు 28: సహకార రంగంలో ఘన చరిత్ర కలిగిన సంస్థ డీసీఎంఎస్. 1942 సంవత్సరంలో స్థాపించిన డీసీఎంఎస్ (డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ) అంచెలంచెలుగా ఎదుగుతూ రైతులకు సేవలందిస్తూ తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకుంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 20 డీసీఎంఎస్ బ్రాంచిల ద్వారా సహకార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో డీసీఎంఎస్ వ్యాపారం గణనీయంగా తగ్గిందని చెబుతున్నారు. 2019 సంవత్సరానికి ముందు వరకు ఎరువుల వ్యాపారాన్ని డీసీఎంఎస్ విస్తృతంగా చేసేది. గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటుతో ప్రభుత్వం నుంచి డీసీఎంఎస్‌కు అందించే ఎరువుల వాటా తగ్గింది. గతంలో 100 శాతం వరకు ఎరువులు కేటాయించేవారు. ఆర్బీకేల ఏర్పాటుతో 15 నుంచి 20 శాతం మాత్రమే ఎరువుల సరఫరా జరిగింది. దీంతో బయట ప్రైవేటు మార్కెట్‌లో కొనుగోలు చేసి రైతులకు ఎరువులు అమ్మకాలు చేసింది. దీంతో డీసీఎంఎస్‌కు అదనపు భారం పడటమే కాకుండా వ్యాపారం కూడా గణనీయంగా పడిపోయింది.

గణనీయంగా పడిపోయిన వ్యాపారం

సహకార రంగంలో డీసీఎంఎస్ పాత్ర అద్వితీయం. రైతుల శ్రేయస్సుకోరి వివిధ వ్యాపారాలను డీసీఎంఎస్ ద్వారా నిర్వహిస్తున్నారు. ఏలూరులో డీసీఎంఎస్ జనరల్ స్టోర్సు ఏర్పాటు చేశారు. ఏలూరు, భీమవరం డీసీఎంఎస్ కేంద్రాలలో జనరిక్ మెడిసిన్ స్టోర్సు ఏర్పాటు చేశారు. ఏలూరులోని డీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో విద్యార్థులకు అవసర మయ్యే స్టేషనరీ, పుస్తకాల అమ్మకాలు కూడా సాగిస్తున్నారు. జనరల్ స్టోర్సులో కార్పొరేట్ మాల్స్ మాదిరిగా అత్యంత తక్కువ ధరలకు నాణ్యమైన నిత్యావసర సరుకులను ప్రజలను అందిస్తున్నారు. దీపావళి సమయంలో బాణసంచా వ్యాపారం ద్వారా లాభాలను ఆర్జిస్తున్నారు. డీసీఎంఎస్‌లో ఏటా రూ. 100 కోట్లుకు పైగా వ్యాపారం జరిగేది. ప్రధానంగా ఎరువుల అమ్మకాలే ఉండేవి. ఐదేళ్లుగా వ్యాపారం గణనీయంగా పడిపోయిందని చెబుతున్నారు. సుమారు రూ.60 కోట్లు మాత్రమే వ్యాపారం జరిగిందని చెబుతున్నారు. దాదాపు 40 కోట్ల వ్యాపారానికి గండి పడిందని చెప్పవచ్చు. డీసీఎంఎస్‌లో జరిగే మిగిలిన వ్యాపార కార్యకలాపాలకు తగిన ప్రోత్సాహం లేకపోవడంతో అక్కడ కూడా వ్యాపారాలు తగ్గాయని చెబుతున్నారు.



ఏలూరులోని సహకార సంఘ స్టోర్

మళ్లీ పూర్వ వైభవం

డీసీఎంఎస్‌లో పాలకవర్గం సొసైటీ సభ్యుల ఎన్నికల ద్వారానే నియామకం జరుగుతూ ఉంటుంది. పాలకవర్గాల సమయం పూర్తయితే ప్రత్యేక అధికారులను నియమించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే గత ప్రభుత్వం డీసీఎంఎస్ పాలకవర్గాలకు సంబంధించి పీఏసీ కమిటీలను నామినేటెడ్‌గా నియమించింది. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో డీసీఎంఎస్‌లో వ్యాపారం పుంజుకుంటుందనే చెబుతున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా 100 శాతం ఎరువులు డీసీఎంఎస్‌కు సరఫరా అయ్యే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.



ఏపీ నిట్‌లో క్రీడా దినోత్సవంలో పాల్గొన్న ఆచార్యులు, విద్యార్థులు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 29 : విద్యార్థులు చదువుతో పాటూ క్రీడల్లోనూ రాణించాలని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్ అన్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పీ.దినేష్‌శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం నిట్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. వీరేష్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తున్నాయని, విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. అసోసియేట్ డీన్ డాక్టర్ కిరణ్‌తీపర్తి మాట్లాడుతూ ఒలింపిక్ క్రీడల్లో భారతదేశం తరుపున మూడుసార్లు బంగారు పతకాలను దేశానికి అందించిన హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టిన రోజును జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. దేశభక్తిని, క్రీడాస్ఫూర్తిని చాటిచెప్పిన ధ్యానచంద్ తరతరాలకు స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తున్నారని కొనియాడారు. తొలుత ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆచార్యులు డాక్టర్ వీ.సందీప్, డాక్టర్ రాముడు, సాస్ అసిస్టెంట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


గొరగనమూడి జ్ఞానానంద హైస్కూల్ పీడీ, విద్యార్థులను సత్కరిస్తున్న జేసీ

స్వామి జ్ఞానానంద హైస్కూల్‌కు ఎక్సలెన్సీ అవార్డు

పాలకోడేరు, ఆగస్టు 29: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ప్రతిభ కనపరిచిన గొరగనమూడి స్వామి జ్ఞానానంద జిల్లా పరిషత్ హైస్కూల్‌కు స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు లభించినట్లు ప్రధానోపాధ్యాయురాలు బీ.శ్రీదేవి తెలిపారు. వరుసగా రెండవ సంవత్సరం కూడా ఈ అవార్డు లభించడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, ఆర్‌జేడీ, జిల్లా విద్యా శాఖాధికారి నాగమణి చేతుల మీదుగా పీడీ విజయలక్ష్మి, విద్యార్థులు ఈ అవార్డు అందుకున్నారు. రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థులు సాధిం చిన సర్టిఫికెట్స్, ప్రతిభా ఆధారంగా అవార్డు వచ్చినట్టు ఆమె తెలిపారు. దీనిలో భాగంగా పాలకోడేరు మండలానికి చెందిన శృంగవృక్షం హైస్కూల్‌కు ద్వితీయ స్థానం లభించిందని తెలిపారు. విద్యాకమిటీ ఛైర్మన్ పొన్నమండ బాలకృష్ణ, సర్పంచ్ గొట్టుముక్కల శివాజీరాజు, ఎంపీటీసీ పార్వతి కృష్ణకుమారి, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపెడా అసిస్టెంట్ డైరెక్టర్ ఆనంద్‌కుమార్

అప్సడా అనుమతులు తప్పనిసరి

కాళ్ల, ఆగస్టు 29 : ఆక్వాసాగు, ప్రాసెసింగ్ ప్లాంట్లు, కోల్డ్ స్టోరేజీ, ఐస్ ప్లాంట్లు నిర్వాహకులు తప్పనిసరిగా అప్సడాలో రిజిస్ట్రేషన్ చేయించుకుని లైసెన్స్ పొందాలని ఎంపెడా అసిస్టెంట్ డైరెక్టర్ ఆనంద్‌కుమార్ తెలిపారు. కాళ్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం మత్స్యశాఖ, ఎంపెడా ఆధ్వర్యంలో ఏపీ ఎస్ఏడీఏ అనుమతులు, ఎంపెడా ఎన్‌రోల్‌మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా విచ్చేసిన ఆనంద్‌కుమార్, ఉండి కేవీకే మత్స్యశాస్త్రజ్ఞులు డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొని రైతులకు సలహాలు, సూచనలు తెలిపారు. కాళ్ల మండలంలో సుమారు 22,387 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోందన్నారు. ఇందులో 7,680 ఎకరాలు మాత్రమే అప్సడా నందు రిజిస్ట్రేషన్ జరిగాయని, ప్రాసెసింగ్ ప్లాంట్లు 6 ఉండగా 3, ఐస్ ప్లాంట్లు 15కి 5 రిజిస్ట్రేషన్ అయినట్లు తెలిపారు. అప్సడాలో రిజిస్ట్రేషన్ కలిగి లైసెన్స్ ఉంటేనే రానున్న రోజుల్లో విద్యుత్ సబ్సిడీ వస్తుందని తెలిపారు. ఆక్వా సాగు చేస్తున్న రైతులు వ్యర్థ జలాలను పంట కాలువల్లోకి వదిలితే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇన్‌చార్జి ఎఫ్‌డీవో రాంబాబు, మత్స్యశాఖ సిబ్బంది, ఆక్వా రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

బాలిక మృతిపై సీహెచ్‌సీలో విచారణ



ఆకివీడు, ఆగస్టు 29 :ఆకివీడు సీహెచ్‌సీలో దుంపగడపకు చెందిన బాలిక దుర్గలహరి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రులు,సీపీఎం నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం ఆసుపత్రిలో డీసీహెచ్ఎస్ పి.సూర్యనారాయణ, ఆసుపత్రి సూపరింటెండెంట్ నజ్రీన్ సమక్షంలో ఎక్స్‌పర్ట్ టీమ్ వైద్యులు పాలకొల్లు, భీమవరం, ఆకివీడుకు చెందిన రవికుమార్, ఎస్.సాయికిరణ్మయి, భూపతిరాజు శివరామకృష్ణంరాజు డ్యూటీ డాక్టర్, స్టాఫ్‌నర్సులను, బాలిక తల్లిదండ్రులను విచారించారు. వైద్యం సక్రమంగానే అందించామని రాత్రి సమయంలో ఒక్కసారిగా బాలికకు తేడా రావడంతో ఏలూరు పంపామని సిబ్బంది తెలిపారు. సాయంత్రం వరకూ బాగానే ఉన్న బాలికకు ఒక్కసారిగా తేడా చేసిందంటే వైద్యుల నిర్లక్ష్యం కాకుండా ఏమౌతుందని ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలందడం లేదని సీపీఎం జిల్లా నాయకుడు గోపాలన్ మండిపడ్డారు.

ఇక.. ప్రభుత్వపరంగా వాసవీ ఆత్మార్పణ రోజు

క్యాబినెట్ నిర్ణయంపై సర్వత్రా హర్షం

పెనుగొండ క్షేత్రం మరింత అభివృద్ధి



ఆచంట, పెనుగొండ, ఆగస్టు 29 : పెనుగొండ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ చేసుకొన్న రోజును అధికారికంగా నిర్వహించాలని దేవ దాయ శాఖకు అప్పగిస్తూ రెండు రోజులు క్రితం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు నాలుగు వేల సంవత్సరాల క్రితం నగరేశ్వరస్వామి ఆలయంలో మహిషాసురమర్ధని అమ్మవారు స్వయంభూగా వెలిశారు. ఇదే ఆలయంలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ చేసుకుంది. ప్రతీ సంవత్సరం మాఘ శుద్ధ విదియ రోజున ఆత్మార్పణ కార్యక్రమం నిర్వహిస్తారు.వచ్చే సంవత్సరం జనవరి 31న అమ్మవారి ఆత్మార్పణ రోజు. ఆత్మార్పణ రోజును ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడంతో భక్తులు పెరిగే అవకాశం ఉంది.ఏప్రిల్, మే నెలలో జయంతి ఉత్సవాలు నిర్వహిస్తారు.

ఇదీ చరిత్ర..

పెనుగొండలో కుసుమశ్రేష్టి, కుసుమాంబ అనే వైశ్య దంపతులకు వాసవి జన్మించింది. వాసవీ బాల్యం నుంచి శివ భక్తురాలు. ప్రతీ నిత్యం నగరేశ్వరస్వామి, మహిషాసురమర్ధని అమ్మవారిని ఆరాధించేది. విష్ణువర్ధనుడు అనేరాజు ఉత్తరాది నుంచి దక్షిణాదికి వస్తూ పెనుగొండలో వాసవిని చూశాడు. ముగ్ధుడై వివాహం చేసుకుంటానని మంత్రితో ఆమె తల్లిదండ్రుల వద్దకు పంపుతాడు. క్షత్రియులతో వైశ్యులకు వివాహం తగదని నిరాకరిస్తుంది. అయితే బలవంతంగానైనా వివాహం చేసుకుంటానని చెప్పి రాజు పెనుగొండకు బయలుదేరతాడు. వివాహం ఇష్టం లేని వాసవీ పెనుగొండ నగరేశ్వరస్వామి ఆలయంలో ప్రజల సమక్షంలో అగ్నిగుండం ఏర్పాటు చేసుకుని ఆత్మార్పణ చేసుకుంటుంది. ఇదే ఆలయంలో వాసవీ విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. చరిత్ర కలిగిన అమ్మవారు ఆర్యవైశ్యుల కులదైవంగా వర్ధిల్లుతూ పెనుగొండ క్షేత్రం ఆధ్యాత్మిక పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చెందింది. మన రాష్ట్రం నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రం నుంచి అనేక మంది ఆర్యవైశ్య సంఘ భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ప్రతీ శని, ఆదివారం రోజుల్లో ఇక్కడ ప్రత్యేక పూజలు జరుగుతుంటాయి. ఇంత ప్రశిద్ధి చెందిన అమ్మవారికి సుమారు 50 ఎకరాలు పైగానే భూమితో పాటు సంవత్సరానికి రూ. 30 లక్షలు పైగానే ఆదాయం వస్తుంది. ఆలయం వద్ద ప్రతీరోజూ అన్నసమారాధన కూడా నిర్వహిస్తారు.

మంచి నిర్ణయమే..



వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు ఆర్యవైశ్యుల కులదైవం. వేల సంవత్సరాల నుంచి అమ్మవారు ఇక్కడ స్వయంభూగా వెలవడంతో మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా తరచూ భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. అమ్మవారి ఆత్మార్పణ రోజును ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం మంచిదే.

కోట వెంకట సుబ్రహ్మణ్యం, ఆలయ పూజారి


సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు అనివేటి మండపం వద్ద సిద్ధమైన వేదిక

క్షేత్రంలో నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 29: చినవెంకన్న క్షేత్రంలోని అనివేటి మండప ఆవరణలో శుక్రవారం జరుగనున్న సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు దేవస్థానం ఏర్పాట్లు పూర్తి చేసింది. శ్రావణమాసంలో ఆఖరి శుక్రవారం పురస్కరించుకుని శ్రీవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీవ్రత నిర్వహణకు వేదికను నిర్మించారు. అరటిబోదెలు, మామిడి తోరణాలుతో సర్వాంగసుందరంగా అలంకరించారు. వ్రతాలకు వచ్చేవారికి దేవస్థానం పసుపు, కుంకుమ, జాకెటుముక్క, కొబ్బరికాయ, ఇతర పూజాసామగ్రి అందజేస్తుందని కలశ పాత్రను తెచ్చుకోవాలని కోరుతున్నారు.

పరమ పవిత్రం..పవిత్రాధివాసం



ద్వారకాతిరుమల, ఆగస్టు 29: శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురం వేణు గోపాల, జగన్నాథ వేంకటేశ్వర ఆలయంలో జరుగుతున్న దివ్య పవిత్రోత్స వాల్లో భాగంగా గురువారం పవిత్రాధి వాసం జరిగింది. ఆలయంలో ఏడాది పొడవునా తెలిసీ తెలియక జరిగిన తప్పుల ప్రాయఃచిత్తం నిమిత్తం ఈ పవిత్రోత్సవాలను నిర్వహిస్తారు. గురువారం ఉదయం ఆలయ యాగశాలలో పవిత్రాలను ఉంచి ముందుగా రుత్వికులు విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. పంచగవ్యప్రోక్షణ జరిపి అగ్ని ప్రతిష్టాపన జరిపారు. అనంతరం పవిత్రాలకు పవిత్రాధివాసాన్ని ఆలయ అర్చ కులు, పండితులు వేదమంత్రోచ్చరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. యాగశాలలో మహాశాంతి హోమాన్ని జరిపారు.

నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ఏలూరుసిటీ, ఆగస్టు 29: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 30వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ఏలూరులోని జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరుగుతుందని జడ్పీ సీఈవో సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థాయి సంఘాల ఎన్నిక, జిల్లా అధికారులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరుగుతుందని ఆయన వివరించారు.

సచివాలయ సిబ్బందికి బదిలీ కౌన్సెలింగ్

ఏలూరు టూటౌన్, ఆగస్టు 29: ఉమ్మడి జిల్లాలోని 8 మున్సిపాలిటీలు ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయాల కార్యదర్శులకు నగర పాలక సంస్థ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇంజనీరింగ్, ఎడ్యుకేషన్, వెల్ఫేర్, అడ్మిన్, ప్లానింగ్, సెక్రటరీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. 128 మంది దరఖాస్తు చేసుకోగా 112 మంది కార్యదర్శులు హాజరయ్యారు. వీరందరికి కావల్సిన చోటుకు బదిలీ చేశారు. అడిషనల్ కమిషనర్ చంద్రయ్య, మున్సిపల్ ఇంజనీర్ కొండల్రావు, ఏసీపీ తిరుపతిరావు,ఎంహెచ్‌వో డాక్టర్ మాలతి, పాల్గొన్నారు.

సిఫార్సు లెటర్లతో ఉద్యోగుల ప్రయత్నాలు

ముదినేపల్లి, ఆగస్టు 29 : గ్రామ సచివాలయాల ఉద్యోగులు తమ తొలి బదిలీ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రాతిపదికన బదిలీలు నిర్వహిస్తున్నందున ప్రస్తుతం ఏలూరు జిల్లాలో ఉన్న ముదినేపల్లి మండలం నుంచి ఎక్కువ శాతం సచివాలయ ఉద్యోగులు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు వెళ్లేందుకు ఆప్షన్లు ఇచ్చారు. మండలం నుంచి వంద మందికి పైగా బదిలీలకు దరఖాస్తులు చేసినట్లు తెలిసింది. ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నాయకుల సిఫార్సుల లెటర్ల ఆధారంగా సచివాలయాల ఉద్యోగులు దరఖాస్తు చేశారు. గురువారం కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో బదిలీల దరఖాస్తుల పరిశీలన జరిగింది.

దిశ పోలీస్ స్టేషన్ పేరు మార్పు

ఏలూరు క్రైం, ఆగస్టు 29 : రాష్ట్రంలో మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మహిళా పోలీస్ స్టేషన్లను వైసీపీ ప్రభుత్వం దిశ పోలీస్ స్టేషన్‌గా మార్పు చేసింది. దిశ చట్టం అమలు చేస్తున్నట్లుగా ప్రజలను నమ్మించారు. వాస్తవానికి కేవలం చట్టాలు తయారు చేశారే కాని ఎలాంటి ఆమోదం చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వాస్తవాలను ప్రజలకు తెలియజేసే విధంగా చర్యలు చేపట్టింది.దీనిలో భాగంగా మహిళల రక్షణకోసం ఏర్పాటు చేసిన మహిళా పోలీస్ స్టేషన్‌గా మార్పు చేసి గవర్నర్ ఆమోదానికి పంపించడంతో ఆయన ఈనెల 28వ తేదీన ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల్లోని దిశ పోలీస్‌స్టేషన్లను మహిళా పోలీస్ స్టేషన్లుగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం నుంచే ఉత్తర్వులు అమలులోకి వచ్చాయి.

ఘాట్ రోడ్డు అంచనా వేయలేం


మ్యాప్ పరిశీలిస్తున్న ఈఈ

ఆగిరిపల్లి, ఆగస్టు 29: ఆగిరిపల్లి శోభనాచల లక్ష్మీ నరసింహస్వామి కొండ పైకి ఘాట్ రోడ్డు అంచనా కోసం మంత్రి పార్థసారధి పంచాయతీ రాజ్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాపిరెడ్డిని పంపించారు. ఆర్అండ్‌బీ ఇంజినీర్లు గాని, విజయవాడ దుర్గామల్లీశ్వర స్వామి దేవస్థానం ఇంజినీర్లు గానీ పరిశీలించాలని తమకైతే రెండు సంవత్సరాలు వ్యవధి పడు తుందని బాపిరెడ్డి తెలిపారు. 2019లో దేవస్థానం కార్యదర్శి హైదరాబాద్ ఆర్కిటెక్ట్ మారుతీ కన్‌స్ట్రక్షన్ వారిచే సుమారు లక్ష రూపాయలు ఖర్చుపెట్టి ఘాట్ రోడ్డు మ్యాప్ వేయించారు. ఈ మ్యాప్ పరిశీలించి అంచనా వేయమని కోరగా పరిశీలిస్తామని తెలిపారు.

చైల్డ్‌కేర్ సంస్థల తనిఖీ చేసిన కమిటీ

ఏలూరు క్రైం, ఆగస్టు 29 : జిల్లాస్థాయి ఇన్‌స్పెక్షన్ కమిటీ ఏలూరు జిల్లాలో ఉన్న రిజిస్టర్డ్ చైల్డ్‌కేర్ ఇనిస్టిట్యూషన్స్, రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్న ఎనిమిది చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్‌లో గురువారం తనిఖీలు నిర్వహించినట్టు డీసీపీవో సూర్యచక్రవేణి తెలిపారు. ఈ హోమ్‌లలో 18 సంవత్సరాల లోపు ఆశ్రయం పొందుతున్న బాలలకు అందిస్తున్న వసతి, ఇతర సదుపాయాలను పరిశీలించారు. నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. ఎవరైనా ఆదరణ, సంరక్షణ అవసరం ఉన్నటువంటి బాలలకు వసతి గృహాలు నడుపుతున్నట్లయితే జువనైల్ జస్టిస్ యాక్ట్ సెక్షన్ 41 ప్రకారం రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. డిస్ట్రిక్ట్ ప్రొబేషన్ ఆఫీసర్ నోడల్ ఆఫీసర్ చైల్డ్‌కేర్ ఇన్‌స్టిట్యూషన్ కన్వీనర్ దుర్గాప్రసాద్, కోకన్వీనర్ డాక్టర్ సూర్య చక్రవేణి,ఏలూరు ఐసీడీసీఎస్ ప్రాజెక్టు చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ పద్మావతి, ఇన్‌ట్యూషనల్ కేర్ ఆఫీసర్ సీహెచ్ శ్రీకాంత్ లీగల్ ప్రొబేషన్ ఆఫీసర్ జాహ్నవి పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల మధ్య గోధుమ తాచు



జంగారెడ్డిగూడెం, ఆగస్టు 29 :జంగారెడ్డిగూడెం బైపాస్ రోడ్డు సమీపంలో చెరుకూరి శ్రీధర్ ఇంటి పక్కనే ఉన్న రాఘవరాజు నాగరాజు ఇంటి వద్ద ఉన్న పొగాకు బేళ్ల మధ్య దాగి ఉన్న గోధుమ తాచు పాము బుసలు కొడుతూ కనిపించడంతో భయభ్రాంతులకు గుర య్యారు. స్నేక్ సేవియర్ సొసైటీ అధ్యక్షుడు చదలవాడ క్రాంతికుమార్‌కు సమాచార మివ్వగా ఆయన అక్కడకు వచ్చి పామును సురక్షితంగా పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు. ఎనిమిది అడుగుల పొడవున్న ఈ పాము అరుదైన విషపూరిత జాతికి చెందిందని తెలిపారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. మహిళ మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు


మృతి చెందిన దాట్ల దుర్గాదేవి

కైకలూరు ఆగస్టు 29: పామర్రు-కత్తిపూడి జాతీయ రహదారిలో ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొన్న సంఘటనలో ఓ మహిళ మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కైకలూరు మండలం శింగాపురంలో గురువారం ఈ ప్రమాద ఘటన చోటుచేసుకుంది. భీమవరం నుంచి ఏలూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు కైకలూరు నుంచి ఆకివీడు వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. బస్సు డ్రైవర్ రహదారి గోతిని తప్పించబోయి ఆటోను పట్టించి కొద్ది దూరం ఈడ్చుకుపోయాడు. ఆటో డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు ప్రయాణికులు ఆటోలో ప్రయాణిస్తున్నారు. ఆ ముగ్గురు పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం చెరుకుమిల్లి గ్రామానికి చెందిన దాట్ల విశ్వనాథరాజు, దాట్ల దుర్గాదేవి, దాట్ల అప్పలరాజు కైకలూరులో టైల్స్ కొనేందుకు వచ్చారు. వాటిని కొనుగోలు చేసి తిరిగి ఆటోలో వెళుతుండగా మార్గమధ్యలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో 108 ద్వారా స్థానికులు కైకలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరి ముగ్గురిని ఏలూరు ప్రభుత్వాస్పత్రికి మెరుగైన చికిత్సకు పంపించగా అక్కడ చికిత్స పొందుతూ దుర్గాదేవి(63) మృతి చెందింది. ఆమె భర్త అయిన దాట్ల విశ్వనాధరాజు పరిస్థితి విషమంగా ఉండడంతో విజయవాడ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి క్షతగాత్రులకు వైద్యసహాయం అందించారు. ఈ సంఘటనపై మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయంలో చోరీకి యత్నం

పెంటపాడు, ఆగస్టు 29 : మండలంలోని బీ.కొండేపాడు సచివాలయంలో గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇవి. సచివాలయం తలుపులు పగులగొట్టి లోపలికి చొరబడి సర్పంచ్ , కార్యదర్శి బీరువా తలుపులు కూడా పగులకొట్టారు. బీరువాలో కాగితాలు అన్నీ చెల్లా చెదురుగా పడవేశారు. అయితే సామాగ్రి ఏదీ చోరీకి గురి కాలేదు.

విధులకు ఆటంకం.. కేసు నమోదు

తణుకు, ఆగస్టు 29 : విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ మూర్తి తెలిపారు. స్టేట్ సేల్స్ టాక్సు డిపార్టుమెంటులో పనిచేస్తున్న అబ్దుల్ అమీద్ బుధవారం రాత్రి తేతలి జాతీయ రహదారి వద్ద విధులు నిర్వహిస్తుండగా ఉండ్రాజవరం మండలం వడ్లూరు గ్రామానికి చెందిన మోపాటి సాయి సురేష్, మోపాటి శ్రీను, దుబా రామకృష్ణ దుర్గాప్రసాదు,గవర దుర్గాప్రసాదు, లంక ఉమా దుర్గారావులు గొడవపడి విధులకు ఆటంకం కలిగించినట్లు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

లారీ ఢీకొని ఒకరి మృతి

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 29 : గురవాయిగూడెం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దగ్గుమల్ల రామారావు (55) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం టి.నర్సాపురం మండలం బొర్రంపాలెం గ్రామానికి చెందిన మృతుడు రామారావు తాపీ పని చేసుస్తుంటాడు. గురువారం మండలంలోని చక్రదేవరపల్లి గ్రామంలోని బంధువుల ఇంటి వద్ద జరిగిన పుట్టిన రోజు వేడుకకు హాజరయ్యాడు. అక్కడ నుంచి జంగారెడ్డిగూడెం పట్టణంలో ఉన్న తన చెల్లెలి ఇంటికి టీవీఎస్ ఎక్సెల్ సూపర్ ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. గురవాయిగూడెం దాటి సామిల్లు వద్దకు వచ్చేసరికి జంగారెడ్డిగూడెం వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో రామారావు తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. జంగారెడ్డిగూడెం ఎస్సై జబీర్, లక్కవరం ఏఎస్సైలు ఘటనా స్థలానికి వెళ్ళి ట్రాఫిక్ అదుపు చేశారు. లారీను, లారీ డ్రైవరు అశోక్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గణపవరంలో ట్యాక్సీ ఢీకొని..

గణపవరం, ఆగస్టు 29: గణపవరం గ్రామానికి చెందిన దాసి వీరాస్వామి (75) ట్యాక్సీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై ఎస్.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో నడిచి వెళ్తున్న వీరాస్వామిని ట్యాక్సీ అతివేగంగా ఢీకొనడంతో అక్కడికక్కడే చనిపోయాడు. వీరాస్వామి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు.

భార్యపై భర్త కత్తితో దాడి


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిర్మల

పెదవేగి, ఆగస్టు 29 : కుటుంబ కలహాల కారణంగా భార్యపై భర్త కత్తితో దాడిచేశాడు. తీవ్రగాయాలైన భార్యను స్థానికులు ఏలూరు ఆస్పత్రికి తరలించారు. పెదవేగి మండలం ముండూరుకు చెందిన భార్యాభర్తలు అనపా అచ్చియ్య, నిర్మలకు ఇద్దరు పిల్లలు. కొంత కాలంగా ఆ ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. గురు వారం మధ్యాహ్నం సమయంలో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. విచక్షణ కోల్పోయిన భర్త అచ్చియ్య కత్తితో భార్య నిర్మలపై దాడిచేసి గాయపర్చాడు. కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలైన ఆమెను స్థానికులు ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు.

బ్లేడుతో మహిళపై దాడి



జంగారెడ్డిగూడెం, ఆగస్టు 29 : మహిళపై బ్లేడుతో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జబీర్ తెలిపారు. పెదవేగి గ్రామానికి చెందిన చిగురుపల్లి సంధ్యారాణి తన భర్తతో విడిపోయింది. తనకు ఆరోగ్యం సరిగా లేక పోవడంతో రెండు సంవత్స రాలుగా పట్టణంలోని పేరం పేట రోడ్డులో నివాసం ఉంటున్న తన చెల్లెలు రిబ్కా ఇంటి వద్దనే ఉంటుంది. ఇదిలా ఉండగా సంధ్యారాణి చెల్లెలు రిబ్కా ముండూరుకు చెందిన స్వరూప్ అనే వ్యక్తితో సహజీవనం సాగిస్తున్నది. ఈ నెల 28 రాత్రి రిబ్కా, స్వరూప్‌లు ఇంటివద్ద గొడవ పడుతుండగా సంధ్యారాణి అడ్డువెళ్ళింది. దీంతో స్వరూప్ కోపంతో సంధ్యారాణి జుట్టు పట్టుకుని బ్లేడుతో మెడపై, గొంతుపై బలంగా కోశాడు. తీవ్ర రక్త స్రావం కావడంతో స్థానికులు ఆమెను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంధ్యారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 29 : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒక వ్యక్తి గురువారం మృతి చెందాడు. దెందులూరు మండలం కొవ్వలి గ్రామానికి చెందిన మేరుగు జాను (42) ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. ఈనెల 24వ తేదీన కొవ్వలిలోని ఒక శుభకార్యానికి హాజరైన భోజనం అనంతరం తన బులెట్‌పై ఆశ్రం ఆసుపత్రికి డ్యూటీకి వస్తూ జాతీయ రహదారిపై నుంచి సర్వీసు రోడ్డులోకి వస్తుండగా ఇసుక పైకి ఎక్కి జారిపడిపోయాడు. తీవ్ర గాయాలకు గురైన అతనిని ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

రైలు కిందపడి పెయింటర్ ఆత్మహత్య

భీమవరం క్రైం, ఆగస్టు 29 : విజయవాడ నుంచి నర్సాపురం వెళ్ళే పోస్ట్ పాసింజర్ రైలు కిందపడి వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ రమణ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి రైలు కింద మృతదేహం ఉన్నట్లుగా సమాచారం అందిందని తెలిపారు. వీరవాసరం మండలం కొణితివాడ గ్రామానికి చెందిన దుండి చంటిబాబు (54)గా గుర్తించామని అతను పెయింటింగ్ పని చేస్తుంటాడని తెలిపారు. ఆత్మహత్య ఎందుకు చేసుకున్నాడనేది తెలియాల్సి ఉందని తెలిపారు. బంధువులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

మహిళల సమగ్రాభివృద్ధే లక్ష్యం : చింతమనేని



మహిళల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే

పెదవేగి, ఆగస్టు 29: మహిళల సమగ్రాభివృద్ధి, సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో గురువారం వివిధ గ్రామాల ప్రజలు ప్రభాకర్‌ను కలిసి వినతులు అందించారు. మహిళల ఆర్థిక స్వావలంబనతోనే సామాజిక వికాసం వస్తుందన్నారు. మహిళలే కుటుంబ వ్యవస్థకు మూలస్థంభాలన్నారు. మహిళల సంక్షేమంతోనే కుటుంబ ఆర్థిక వ్యవస్థ మెరుగవుతుందని, మహిళాభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని ప్రభాకర్ వివరించారు. బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణప్రసాద్, నంబూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకు అధికారులతో సమీక్ష

ఏలూరు రూరల్, ఆగస్టు 29: దెందులూరు నియోజకవర్గంలోని సహకార సంఘాల అధికారులు, మాజీ అధ్యక్షులతో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. 2019-2024 మధ్యలో వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల కారణంగా సహకార బ్యాంకు నష్టాల బాటలో పయనించాయన్నారు. సహకార సంఘాలకు ఏక్షణానైనా ఎన్నికలు వస్తే సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా సహకార బ్యాంకు అధికారులు, మాజీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం : ఎమ్మెల్యే చంటి



ఎమ్మెల్యే చంటిని సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

ఏలూరు టూటౌన్, ఆగస్టు 29: అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అక్కడికక్కడే సంబంధిత అధికారులు సమస్యలు పరిష్కరించే విధంగా అధికారులకు ఆదేశాలిచ్చారు. సంక్షేమం అభివృద్ధి ప్రజాసమస్యల పరిష్కారం ధ్యేయంగా ముందుకెళుతున్నామని ఆయన అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వాసవి కన్యాకపరమేశ్వరి అమ్మవారి ఆత్మర్పణ దినోత్సవాన్ని రాష్ట్ర పండుగగా నిర్ణయించడం కోసం కృషి చేసిన ఎమ్మెల్యే బడేటి చంటిని అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. అర్బన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్. శివకృష్ణ బ్రహ్మయ్య, నున్నా శ్రీనివాసరావు, తవ్వా అరుణకుమారి, ఎం.పవన్‌కుమార్, పైడేటి రఘు, ఎన్.సత్యనారాయణ, మురళి, సుబ్బారావు, కె.రాజేష్, పాల్గొన్నారు.

వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల ఆందోళన



జంగారెడ్డిగూడెంలో ఉద్యోగుల నిరసన

ఏలూరు అర్బన్, ఆగస్టు 29: వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులను గత వైసీపీ ప్రభుత్వ బలవంతపు బదిలీలు చేసిందని ఉద్యోగులు నిరసన కొనసాగిస్తున్నారు. లోపాలు సరిదిద్దే వరకు ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలను వాయిదా వేయాలని ఏలూరు జేసీటీవో కార్యాలయంవద్ద మూడు రోజులుగా చేస్తున్న ఆందోళన గురువారం కొనసాగింది. ఏపీ కమర్షియల్ ట్యాక్సెస్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శేషుకుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అన్యాయంగా ఆర్డర్ టూ సర్వ్ పేరిట 480 మంది ఉద్యోగులకు జారీచేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని, అందరికీ సమన్యాయం చేసిన తర్వాతే సాధారణ బదిలీలు చేపట్టాలని కోరారు. జగన్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేసిన ప్రాంతీయ కార్యాలయాలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేశారు.

● జంగారెడ్డిగూడెం: రీజనల్ కార్యాలయాలను రద్దు చేసే వరకు బదిలీలను నిలిపివేయాలని వాణిజ్య పన్నుల శాఖ సర్వీసెస్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు కొప్పుల సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలపై దర్యాప్తు చేయాలని, సెంట్రల్ రిజిస్ట్రేషన్ యూనిట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏలూరు డివిజన్ సహాయ కార్యదర్శి ఎ.వెంకటేశ్వరరావు, కె.రాజ్యలక్ష్మి, జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా నీటి సంఘాల ఎన్నికలు జరపాలి



బొమ్మిడిలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఉంగుటూరు, ఆగస్టు 29: సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని బొమ్మిడి సొసైటీ ఆవరణలో గురువారం జరిగిన రైతులు, కౌలు రైతుల సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. గత ఐదేళ్లుగా సాగునీటి సంఘాలను ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడ్డారని, రాజకీయాలకు అతీతంగా ఎన్నికలు జరపడం ద్వారా డెల్టా కాలువల ఆధునీకరణతో పాటు కృష్ణా, గోదావరి జిల్లా పరిధిలో ఆయకట్టు శివారు భూములకు సాగునీరు సక్రమంగా అందించాలన్నారు. సమావేశంలో గుండుగొలను డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ గుత్తికొండ వెంకట కృష్ణారావు, కట్టా భాస్కరరావు, దుడే కేశవ, రాంబాబు, వానపల్లి సత్యనారాయణ, నక్కా ధనుంజయరావు, మారిశెట్టి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అర్చకులకు జీతాల పెంపుపై హర్షం

ఏలూరు టూటౌన్, ఆగస్టు 29: ఆలయ అర్చకులకు వేతనాల పెంపుపై అఖిల భారత బ్రాహ్మణ సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు ఎంబీఎస్.శర్మ హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఇచ్చే రూ.10 వేలను రూ.15వేలకు పెంచడంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ధూపదీప, నైవేద్యాలకు రూ. 5 వేల నుంచి 10వేలకు పెంచడం, నిరుద్యోగ పేద విద్యార్థులకు రూ.3వేల భృతి ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టి ఇచ్చిన హామీలు నెరవేరుస్తుందన్నారు. దేవాలయాల ట్రస్ట్ బోర్డులో మరో ఇద్దరికి అవకాశం కల్పించాలన్నారు. ఆధ్యాత్మిక, పర్యాటకాభివృద్ధికి మంత్రులతో కమిటీ ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటి కమిషనర్‌గా శివారెడ్డి

ఏలూరుసిటీ, ఆగస్టు 29: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్, డిప్యూటి కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్లను బదిలీ చేశారు. ఇందులో భాగంగా బి శివారెడ్డిని ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.






ఏలూరులో తెలుగుతల్లి విగ్రహానికి వైఎంహెచ్ఏ సభ్యుల పూలమాల, భీమడోలు గిడుగు చిత్రపటం వద్ద నివాళి, పెదవేగి పాఠశాలలో హెచ్ఎం, ఉపాధ్యాయుల నివాళి, దెందులూరులో నర్సింగ్ విద్యార్థుల అక్షర ప్రదర్శన

అమ్మ మాటే మాతృభాష

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



ఏలూరులోని పాఠశాలలో ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణ

ఏలూరు సిటీ, ఆగస్టు 29: అమ్మ మాటే మాతృభాష అని పలువురు వక్తలు అన్నారు. జిల్లాలో మాతృభాషా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి కలెక్టర్ కె.వెట్రిసెల్వి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిడుగు రామ్మూర్తి తెలుగుభాషా ఔనత్యాన్ని చాటి చెప్పిన గొప్ప వ్యక్తి అన్నారు. డీఆర్వో డి.పుష్పమణి, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, ఎల్‌డీఎం డి.నీలాద్రి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

● ఏలూరు అర్బన్: నగరంలోని పలు విద్యా సంస్థల్లో మాతృ భాషా దినోత్సవం నిర్వహించారు. కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ గిరిబాబు, తెలుగు అధ్యాపకుడు పరమేశ మాట్లాడారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్‌ప్రిన్సిపాల్ రాంబాబు, సీడీపీసీ సభ్యుడు ఎల్.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు దుర్గాప్రసాద్, శ్రీహరి కోటి, తదితరులు పాల్గొన్నారు. సీఆర్ఆర్ కళాశాలలో శతావధాని బులుసు అపర్ణ మాట్లాడుతూ తెలుగు నుడికారం, జాతీయాలు, పదబంధాలు, సామెతలు తెలుగు భాషకు అందాన్ని తెచ్చాయన్నారు. కరస్పాండెంట్ కె.వి.సుబ్బారావు, ప్రిన్సిపాల్ రామరాజు, మేడసాని శ్రీనివాసరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు. వెంకటాపురం పాఠశాలలో తెలుగుతల్లి వేషధారణలో బాలలు ఆకట్టుకున్నారు. తెలుగు టీచర్ మెర్సీని సత్కరించారు. ఆర్ఆర్ పేట శ్రీ శర్వాణి పాఠశాలలో చిన్నారులు కవుల వేషధారణలు, తెలుగుతల్లి వేషధారణల్లో అలరించారు.

● ఏలూరు రూరల్: తల్లిఒడే బిడ్డకు తొలిబడి, అమ్మమాటే మాతృభాష అని వైఎంహెచ్ఏ గౌరవ అధ్యక్షుడు అంబికా రాజా అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా వైఎంహెచ్ఏ ఆధ్వర్యంలో తెలుగుతల్లి విగ్రహానికి, గిడుగురామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సాహితివేత్త లంకా వెంకటేశ్వర్లు, గుడిపాటి లలిత, ఎల్.వెంకటేశ్వరరావు, కేబీ రావు, డి.హేమసుందర్, తెలుగుబాష అభిమానులు పాల్గొన్నారు.

● దెందులూరు: నర్సింగ్ కాలేజీలో తెలుగు భాషా దినోత్సవం విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు తెలుగు భాషా గొప్పతనాన్ని వివరిస్తూ అక్షర ప్రదర్శన నిర్వహించారు. విజయ నగేష్, కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: తెలుగు భాషను కాపాడుకోవాలని, సాహిత్య సంపదను భావితరాలకు అందించాలని గుణ్ణంపల్లి జడ్పీ స్కూల్ ఉపాధ్యాయుడు నీలి శ్రీనివాస్ అన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జయంతి హెచ్ఎం డి.వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించా. విద్యార్థులు తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిచేప్పేలా నృత్యప్రదర్శన, పద్యాలు, గేయాలు. నాటికలతో పండుగ వాతావరణం నెలకొంది. వెంకటస్వామి, వరలక్ష్మి, సంస్కృత టీచర్ ఈశ్వరి, అరుణ, తదితరులను సత్కరించారు.

● పెదపాడు: వట్లూరు బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం జరిగాయి. తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు, ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌ల గురించి విద్యార్థులకు వివరించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి బహుమతులు అందజేశారు.



టి.నరసాపురంలో తెలుగు అక్షరాల ప్రదర్శన

● భీమడోలు: శాఖా గ్రంథాలయంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి, ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. వారి చిత్రపటానికి నివాళులర్పించారు. తుమ్మల ఉమామహేశ్వరరావు ఎం సుధాకర్, గ్రంథ పాలకుడు శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

● పెదవేగి: తెలుగు భాష అభివృద్ధికి గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు చేసిన కృషి ఎనలేనిదని కొప్పాక జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆర్. శైలజ అన్నారు. గిడుగు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి, క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల పీడీ మోర్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: తెలుగులో విద్యాబోధనతో విద్యార్థుల్లో పరిపూర్ణ వికాసం చేకూరుతుందని పురం శ్రీనివాస్ అన్నారు. పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం, క్రీడా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు పాటల, వక్తృత్వ పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

వృద్ధురాలి కడుపులో గడ్డలు తొలగించిన వైద్యులు



ఆపరేషన్ నిర్వహించిన వైద్య బృందం

ఏలూరు అర్బన్, ఆగస్టు 29: అరుదైన వ్యాధితో బాధపడుతున్న 67 ఏళ్ల వృద్ధురాలి కడుపులో గడ్డలను ఆయుష్ వైద్యులు తొలగించారు. హాస్పిటల్స్ మేనేజర్ కాశీనాథ్ జాస్తి గురువారం వివరాలు తెలిపారు. కిడ్నీ వ్యాధికితోడు సిర్రోసిస్ ఆఫ్ లివర్ ముదరడంతో వృద్ధురాలి కడుపులో 3 గడ్డలు ఉన్నట్టు వైద్యపరీక్షల్లో గుర్తించారు. వృద్ధాప్యం కారణంగా శస్త్రచికిత్స సవాల్‌తో కూడుకున్నదే అయినప్పటికీ మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ వెంకట జయదీప్ నేతృత్వంలోని వైద్య బృందం శస్త్రచికిత్స చేసి పెద్దపేగులోని మూడు పెద్ద గడ్డలను తొలగించారని వివరించారు. ఆపరేషన్ అనంతరం వృద్ధురాలు పూర్తి ఆరోగ్యంతో ఉన్నారని తెలిపారు. శస్త్రచికిత్స నిర్వహించిన వైద్యబృందం లోశ్రీరామ్, ప్రవీణ్, ప్రశాంతి పాల్గొన్నారని వివరించారు.

పురుగు మందు తాగిన వ్యక్తిని కాపాడిన వైద్య సిబ్బంది

కుక్కునూరు, ఆగస్టు 29: చీరవల్లి గ్రామానికి చెందిన వ్యక్తి పురుగు మందు తాగి గురువారం అమరవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. ఆసుపత్రిలో మెరుగైన వైద్య సదుపాయాలు ఉండడంతో వైద్యులు తక్షణ వైద్య సేవలందించి ప్రాణాపాయం నుంచి కాపాడినట్లు డాక్టర్ అనంత్ తెలిపారు. ఎట్టిపరిస్థితుల్లో క్షణికావేశంలో పురుగు మందు తాగి బలన్మరణానికి పాల్పడవద్దని డాక్టర్ అనంత్ సూచించారు.

గొంతు క్యాన్సర్ బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్

ఉంగుటూరు, ఆగస్టు 29: మండలంలోని బొమ్మిడిలో గొంతు క్యాన్సర్ బాధితుడు వడ్డి వెంకన్న ఇటీవల ఆపరేషన్ చేయించుకున్నాడు. మాజీ ఎంపీపీ మారిశెట్టి లోకనాథ శివప్రసాద్ ద్వారా స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బాధితునికి రూ.1.88లక్షల చెక్కును గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందించారు.

ఉండ్రాజవరంలో కల్యాణ వేదిక ప్రారంభం

దెందులూరు, ఆగస్టు 29: గ్రామస్తుల ప్రయోజనార్థం రూ 5 లక్షలతో కల్యాణ మండపం వేదికను నిర్మించడం అభినందనీయమని లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ జరజాపు రంగారావు అన్నారు. పోతునూరు శివారు ఉండ్రాజవరంలో మద్దుల అశోక్‌కుమార్ జ్ఞాపకార్థం మద్దుల వెంకటరమణమ్మ, అనురాధ నిర్మించిన కల్యాణ మండపం వేదికను మద్దుల సూర్యనారాయణ, చిన్న తిరుపతమ్మ గురువారం ప్రారంభించారు. చుక్కా అవినాష్‌రాజు, రమణమూర్తి, బి.సురేష్‌బాబు, ఎం.సత్యనారాయణ, జారజాపు శ్రీనివాసరావు, అనకాపల్లి నరసింహరావు, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం శివ కల్యాణం

ద్వారకాతిరుమల, ఆగస్టు 29: క్షేత్రపాలకుడు శివదేవుని ఆలయంలో స్వామివారి కల్యాణం గురువారం నేత్రపర్వంగా జరిగింది. చినవెంకన్న ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఈ ఆలయంలో కల్యాణ మహోత్సవం పురస్కరించుకుని ముందుగా ఆలయ పరిసరాలను అలంకరించారు. ఆలయ ముఖమండపంలో ఏర్పాటు చేసిన వేదికపై గంగా, పార్వతీసమేత శివయ్య మూర్తులను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకారాలు చేసి కల్యాణతంతు ప్రారంభించారు. శుభముహూర్త సమయంలో అర్చకులు, పండితులు వేద మంత్రోచ్ఛరణల నడుమ నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర బెల్లం ధరింపచేసి మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘనంగా నిర్వహించారు.

వెల్లమిల్లి నిధుల దుర్వినియోగంపై డీఎల్‌పీవో విచారణ

ఉంగుటూరు, ఆగస్టు 29: వెల్లమిల్లి పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై గురువారం ఏలూరు డీఎల్‌పీవో పూర్ణ చంద్రశేఖర రావు విచారణ జరిపారు. సర్పంచ్ వస్కా కుమార్ రాజా, ఫిర్యాదిదారులు హాజరయ్యారు. కార్యదర్శి గైర్హాజరయ్యారు. నిధుల దుర్వినియోగంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కార్యదర్శికి మూడు రోజులు గడువు ఇచ్చి రెవెన్యూ, పోలీసు, పంచాయతీ సిబ్బంది సమక్షంలో పంచాయతీ రికార్డులు స్వాధీనం చేసుకుంటామని డీఎల్‌పీవో తెలిపారు. గత పాలకవర్గం నుంచే నిధుల దుర్వినియోగం జరుగుతుందని, పంచాయతీ చేపల చెర్వుల వేలంలో అక్రమాలకు పాల్పడ్డారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నృత్యకళాకారిణి కృష్ణశ్రీకి అమెరికాలో సత్కారం

ఏలూరు రూరల్, ఆగస్టు 29: ఏలూరు నగరానికి చెందిన కూచిపూడి నాట్య విద్యార్థిని చల్లా కృష్ణశ్రీకి పశ్చిమ అమెరికాలో ఆనందోబ్రహ్మ ఆధ్యాత్మిక సంస్థ అభినందన సత్కారం నిర్వహించింది. ప్రముఖ కూచిపూడి నృత్య గురువు కళారత్న కె.వి సత్యనారాయణ నృత్యదర్శకత్వంలో అమెరికా డెన్‌వర్ నగరంలో స్కూల్‌హౌస్ థియేటర్ కళావేదికపై ప్రదర్శించిన నృత్యాక్షరి నృత్య రూపకంలో అమెరికా దేశంలో కృష్ణశ్రీ అరంగేట్రం చేసింది. 15మంది బృందంతో ప్రదర్శించిన నృత్యరూపకం అమెరికా వాసులను, ప్రవాస భారతీయులను విశేషంగా ఆకట్టుకుంది. ఆనందోబ్రహ్మ సంస్థ వ్యవస్థాపకులు, చైర్మన్ బీఎస్ గోపాలకృష్ణ, కళాబృందంపై ప్రశంసలు కురిపించారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్టకు చర్యలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 29: ఎర్రకాల్వలోకి జొరబడి అక్రమార్కులు ఇసుక తవ్వకుండా ద్వారకాతిరుమల ఎస్ఐ సుధీర్ రెవెన్యూ సహాయంతో మార్గమధ్యలో గొయ్యి తవ్వించారు. మండలంలోని ఐఎస్ జగన్నాథపురం, రాఘవాపురం గ్రామాల్లో ఉన్న ఈకాల్వ నుంచి ఇసుక అక్రమ రవాణా అడ్డుకునేందుకు ఈ చర్యలు ఎస్పీ ఆదేశాల మేరకు తీసుకున్నట్లు వివరించారు. మండలంలో ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫ్యాషన్ డిజైనింగ్‌లో ఉచిత శిక్షణ

ఏలూరు టూటౌన్, ఆగస్టు 29: యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో మహిళలకు ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ కే.శశిధర్ తెలిపారు. ఎంపికైన వారికి 30రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు భోజన వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. అభ్యర్థులు 5వ తరగతి ఆపైన చదివి ఉండాలన్నారు. సెప్టెంబర్ 3 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. అభ్యర్థులు ఫోన్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఆధార్, రేషన్ కార్డు జిరాక్సులు, ఫొటోలు తీసుకురావాలన్నారు. వివరాలకు 9948565256ను సంప్రదించాలన్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్

పెదపాడు, ఆగస్టు 29: చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తుండగా వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. పెదపాడు వద్ద తనిఖీ నిర్వహించి ఐషర్ వాహనంలో కోళ్లవ్యర్థాలను తరలిస్తున్న వాహనం, కోళ్లవ్యర్థాలను సీజ్ చేసినట్లు ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. వాహన, చెరువు యజమాని, వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేసి పెదపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న కోళ్లవ్యర్థాలను గొయ్యి తీసి పూడ్చి పెట్టించినట్లు ఎస్సై శుభశేఖర్ చెప్పారు.

తెలంగాణకు ఇసుక తరలిస్తున్న లారీల పట్టివేత

చింతలపూడి, ఆగస్టు 29: అలిపెల్లి సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద తెలంగాణకు ఇసుక తరలిస్తున్న రెండు లారీలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కుటుంబరావు తెలిపారు. కుక్కునూరు పాయింట్ నుంచి జీలుగుమిల్లి, యర్రగుంటపల్లి మీదుగా ఆంధ్రాలోకి వెళ్లాల్సిన లారీలు తిరిగి అలిపల్లి మీదుగా తెలంగాణకు తరలిస్తున్నారని గుర్తించి లారీలను సీజ్ చేసినట్లు తెలిపారు.

నగరంలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు

ఏలూరు టూటౌన్, ఆగస్టు 29: నగరంలో రోడ్లు, డ్రెయిన్లు యుద్ధ ప్రతిపాదికన నిర్మించనున్నట్లు కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్.పెదబాబు తెలిపారు. నగరంలో డ్రైన్లలో పూడికలను గురువారం తొలగించారు. రూ.80లక్షలతో రోడ్లు మరమ్మతులు చేపడుతున్నామన్నారు. బ్రాందీషాపుల యాజమానులు డ్రైన్లలో కూల్‌డ్రింకులు, ప్లాస్టిక్ సీసాలు, మందు బాటిళ్లు వేయడం వలన మురుగునీరు పారక ప్రజలు ఇబ్బందులుపడుతున్నారన్నారు. షాపు యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్లు విజయ్‌కుమార్, శ్రీనివాస్, నున్నా కిశోర్, తేజ, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా ప్రముఖ్‌గా మాలతీరాణి

ఉంగుటూరు, ఆగస్టు 29: బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా ప్రముఖ్‌గా నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణిని నియమించారు. ప్రముఖ్‌తో పాటు జిల్లా సహ ప్రముఖ్‌లుగా కట్టా సత్యనారాయణ, అగ్రహారపు వెంకటేశ్వరరావు, అడబాక నాగ సురేష్‌ను నియమించారు. సెప్టెంబరు 1 నుండిచి 25 వరకు అక్టోబరు 1 నుంచి 15వరకు రెండు దఫాలుగా సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందని మాలతీరాణి వివరించారు. సభ్యత్వ టోల్ ఫ్రీ నెం:8800002024కు డయల్ చేయాలని ఆమె కోరారు.

ఓటర్ల జాబితా సవరణకు సర్వే : కలెక్టర్

ఏలూరు సిటీ, ఆగస్టు 29: ఓటర్ల జాబితా సవరణకు అక్టోబరు 18 వరకు బీఎల్వోలు ఇంటింటికీ సర్వే చేస్తారని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఓటర్లు, కుటుంబ సభ్యుల వివరాలు, మరణించిన వారి వివరాలు తెలియజేయాలన్నారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేయించుకోవాలన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు నమోదు కొరకు బూత్ స్థాయి అధికారి వారిని కాని లేదా సంబంధిత తహసీల్దార్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేయించుకోండి

దెందులూరు, ఆగస్టు 29: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం ఫారం 19, దరఖాస్తు చేయాలని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓట్లపై గురువారం వివరాలు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాల ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఫారం 19 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో కనీసం మూడేళ్ల నివాసం ఉండాలన్నారు.

గిరిజన సంఘాలతో ఇసుక అమ్మకాలు చేపట్టాలి

కుక్కునూరు, ఆగస్టు 29: ఏజెన్సీలో ఇసుక ర్యాంపుల నిర్వహణ గిరిజన సొసైటీల ద్వారా చేపట్టాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రాజ్యాంగంలో గిరిజనసులకు అనేక అవకాశాలు, హక్కులు కల్పించబడ్డాయన్నారు. షెడ్యూల్ ఏరియాలో పీసా చట్టం అమలు చేసి గ్రామసభల ద్వారా గిరిజన సొసైటీలకు, ఇసుక కమిటీల ద్వారా ఇసుక అమ్మకాలు నిర్వహించాలన్నారు. ఇబ్రహీంపేటలో ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించకుండా స్థానిక ప్రజల అవసరాల కోసం అమ్మకాలు జరపాలన్నారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, వీ.పాపారావు, కే.కల్లయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత వేగి లక్ష్మి సేవలు చిరస్మరణీయం



భోజనం వడ్డిస్తున్న వేగి ప్రసాద్

ఏలూరు టూటౌన్, ఆగస్టు 29: టీడీపీ మహిళా అధ్యక్షురాలిగా వేగి లక్ష్మీ సేవలు చిరస్మరణీయమని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, ఆమె భర్త వేగి ప్రసాద్ అన్నారు. వేగి లక్ష్మి వర్థంతి సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల బాలికల వసతిగృహంలో గురువారం భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ప్రసాద్ మాట్లాడుతూ మహిళా అభ్యూదయం కోసం టీడీపీ తరపున ఎన్నో పోరాట కార్యక్రమాలు లక్ష్మీనిర్వహించారని అన్నారు. డ్వాక్రా మహిళలు, ఆశావర్కర్ల జీతాల పెరుగుదల కోసం పోరాటాలు చేశారని అన్నారు. కుటుంబ సభ్యులు వేగి సిద్ధూ, వేగి సాయి శ్రీకన్య పాల్గొన్నారు.

గ్యాస్ లీకై అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

ఏలూరు క్రైం, ఆగస్టు 29: కుమారుడి పుట్టినరోజు సందర్భంగా పిండి వంటలు తయారు చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై అగ్నిప్రమాదం సంభవించింది. ఏలూరు అశోక్ నగర్‌లోని నెక్స్ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ నెంబర్ 101లో జోషి కుటుంబం నివాసం ఉంటుంది. ఆయన కుమారుడి పుట్టినరోజు సందర్భంగా గురువారం రాత్రి వంట కార్యక్రమాలు నిర్వహిస్తుండగా గ్యాస్ స్టవ్ లీక్ కావడంతో వంటి గది మొత్తం కాలిపోయింది. సమాచారం అందుకున్న ఏలూరు అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడ చేరుకొని మంటలు అదుపు చేశారు. సుమారు రెండు లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లుగా ప్రాథమిక అంచనా వేశారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** శనివారపుపేట సబ్‌స్టేషన్ మరమ్మత్తుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుండి 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ జె.పి.బి నటరాజన్ తెలిపారు.
- **పెదపాడు :** మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపీడీవో తేజరతన్ తెలిపారు అధికారులు, ప్రజాప్రతినిధులంతా సర్వసభ్య సమావేశంలో పాల్గొవాలని ఎంపీడీవో కోరారు.
- పెదపాడు మండలం వట్లూరులోని రైతు సేవా కేంద్రాన్ని ఆర్డీవో ఖాజావలి గురువారం పరిశీలించారు. త్వరలో ధాన్యం కొనుగోలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అన్ని సౌకర్యాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.
- **చింతలపూడి :** వనమహోత్సవానికి మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో మొక్కలు పంపిణీకి సిద్ధం చేసినట్లు ఎంపీడీవో మురళీకృష్ణ తెలిపారు. నామవరం నర్సరీ నుంచి మొక్కలను గ్రామ కార్యదర్శులు తీసుకువెళ్లి ప్రజలకు అందజేయాలన్నారు.
- **ఉంగుటూరు :** త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉప్పాకపాడులో కృష్ణ భగవానుని ఊరేగింపుతో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా ముగిశాయి.
- ఉంగుటూరు మండలంలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో 200 మొక్కలను నాటేందుకు సిద్ధంగా ఉన్నాయని ప్రజా ప్రతినిధులు, నాయకులు స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.
- **పోలవరం :** మండలంలో వాతావరణంలో అల్పపీడన ప్రభావంతో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ వర్షం కురిసింది. వీడని ముసురు వలన జనజీవనం స్థంబించింది.
- **బుట్టాయగూడెం :** ఏజెన్సీవాసులు విషజ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారని, ఏజెన్సీలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి వైద్య సేవలందించాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రభుత్వాన్ని కోరారు.
- బుట్టాయగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల పిజిటి వింజరపు దుర్గారావు(49) గురువారం మరణించారు. ఆయన కొంతకాలంగా కిడ్నీల వ్యాధితో బాధపడుతున్నారు. గుంటూరు తరలించగా డయాలసిస్ చేస్తుండగా మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.
- **కుక్కునూరు :** శ్రీధర గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి వారం రోజులు కావస్తున్న కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదని గ్రామస్థులు చెబుతున్నారు. లోఓల్టేజ్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు.



క్రీడాజ్యోతితో కలెక్టర్ వెట్రిసెల్వి, అధికారుల త్రీకె రన్



కైకరం హైస్కూలులో జాతీయ క్రీడా దినోత్సవ ర్యాలీ



పెదవేగిలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ నివాళి



ఏలూరులో స్కేటింగ్ చేస్తూ బాలుర క్రీడాదినోత్సవ ప్రదర్శన

క్రీడల్లో రాణించాలి

క్రీడాకారులకు స్ఫూర్తి ధ్యాన్‌చంద్

ఏలూరు రూరల్, ఆగస్టు 29: విద్యార్థులు, యువత క్రీడల్లో రాణించాలని పలువురు అన్నారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఇండోర్ స్టేడియంలో గురువారం క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జడ్పీచైర్మన్ ఘంటా పద్మశ్రీ క్రీడా జ్యోతి వెలిగించి త్రీకే రన్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరి జీవితంలో వ్యాయామం ఒక భాగం కావాలన్నారు. రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ క్రీడల్లో ఏలూరు జిల్లా క్రీడాకారులు ప్రథమ స్థానంలో ఉండాలన్నారు. కొత్త బస్టాండు మీదుగా ఫైర్‌స్టేషన్ వరకు త్రీకే రన్ సాగింది. అక్కడ క్రీడాకారులు మానవహారం ఏర్పాటుచేసి క్రీడా ప్రతిజ్ఞ చేశారు. క్రీడాపోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు కలెక్టర్ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన వారికి, కోచ్‌లకు క్రీడాకారులను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఖాజావలీ, డీఈవో ఎస్.అబ్రహం, డీవైఈవో ప్రభాకర్‌రావు, డీఎస్‌డీవో శ్రీనివాసరావు, క్రీడాకారులు తదిరతులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో నైపుణ్యం పొందడం ద్వారా మంచి భవిష్యత్తును సాధించవచ్చని సర్పంచ్ సలగాల గోపి, విద్యా కమిటీ చైర్మన్ అల్లూరి జగదీశ్వరి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పాఠశాల హెచ్ఎం గుళ్ళ ప్రసాదరావు రూ.50వేలతో క్రీడాకారులకు యూనిఫాం అందజేశారు. మైదానంలో 3కే రన్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్, విద్యా కమిటీ చైర్మన్, పీడీలు గంగారత్నం, నాగ సుధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పోటీలలో 25 మంది క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. అనంతరం పురవీధులలో ర్యాలీ నిర్వహించారు.

● పెదవేగి: క్రీడా జగత్తుకు ధ్యాన్‌చంద్ జీవితం స్ఫూర్తి అని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ మాడా వెంకటేశ్వరరావు అన్నారు. ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవం గురుకుల విద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించిన ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ హాకీ క్రీడలో మూడుసార్లు దేశానికి బంగారు పతకాలను అందించిన ధ్యాన్‌చంద్ జయంతిని ప్రభుత్వం జాతీయ క్రీడా దినోత్సవంగా ప్రకటించి, ఏటా జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. ఆయన స్ఫూర్తితో విద్యార్థులు క్రీడాకారులుగా ఎదగాలన్నారు.

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం 2023- 24 విద్యా సంవత్సరంలో జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలకు సంబంధించి స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డును ప్రథమ స్థానంతో సాధించిందని ప్రిన్సిపాల్ మాడా వెంకటేశ్వరరావు తెలిపారు. దీంతోపాటు రాష్ట్రస్థాయిలోని 192 గురుకుల విద్యాలయాల్లో జిల్లాస్థాయి విభాగంలో ప్రథమ స్థానంలో పెదవేగి గురుకుల విద్యాలయం మాత్రమే నిలిచిందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ను పీడీ జయరాజు, పీఈటీ గురుమూర్తి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

● కుక్కునూరు: కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ఏలూరులో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సునీత విద్యార్థులకు జాతీయ క్రీడాదినోత్సవ అవశ్యకతను వివరించారు. క్రీడల వలన మానసిక, శారీరక ధృడత్వం, మంచి ఆరోగ్యం ఏర్పాడుతుందని తెలిపారు. అనంతరం బాలికల క్రీడా విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కుంజా రమాదేవి, స్వయం బిందు, సొందే పార్వతి, ఉమా, తదితరులు పాల్గొన్నారు.

తొలి బదిలీ కోసం..

సిఫార్సు లెటర్లతో గ్రామ సచివాలయ ఉద్యోగుల ప్రయత్నాలు

ముదినేపల్లి, ఆగస్టు 29 : గ్రామ సచివాలయ ఉద్యోగులు తమ తొలి బదిలీ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం బదిలీల కోసం సచివాలయ ఉద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. ఉద్యోగాల్లో చేరాక వారికి ఇదే తొలి బదిలీ అవకాశం. ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రాతిపదికన బదిలీలు నిర్వహిస్తున్నందున ప్రస్తుతం ఏలూరు జిల్లాలో ఉన్న ముదినేపల్లి మండలం నుంచి ఎక్కువ శాతం సచివాలయ ఉద్యోగులు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు వెళ్లేందుకు ఆప్షన్లు ఇచ్చారు. మండలం నుంచి వంద మందికి పైగా బదిలీలకు దరఖాస్తులు చేసినట్లు తెలిసింది. ఐదేళ్ల సర్వీసు పూర్తయ్యేందుకు మరో రెండు నెలల సమయం ఉన్నప్పటికీ బదిలీ కోరుకుంటున్న ప్రాంతాలకు చెందిన ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నాయకుల సిఫార్సుల లెటర్ల ఆధారంగా సచివాలయాల ఉద్యోగులు దరఖాస్తు చేశారు. గురువారం కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో బదిలీల దరఖాస్తుల పరిశీలన జరిగింది. తొలి పోస్టింగ్ పొంది ఇతర జిల్లాల నుంచి ముదినేపల్లి మండలంలో జాయిన్ అయిన గ్రామ సచివాలయాల ఉద్యోగులు కూడా తమ ప్రాంతాలకు బదిలీ చేయించుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. కొంత మంది విజయనగరం, శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన ఉద్యోగులు ఇప్పుడు తమ జిల్లాలకు బదిలీ కోసం అక్కడి ప్రజాప్రతినిధుల లెటర్లు తీసుకుని తమకు నచ్చిన ప్రాంతం కోసం ప్రయత్నిస్తున్నారు.

ఏకీకృత పింఛన్ విధానాన్ని రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయినులు

ముదినేపల్లి, ఆగస్టు 29 : కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఏకీకృత పింఛను విధానాన్ని రద్దు చేయాలంటూ గురువారం ముదినేపల్లిలో మహిళా ఉపాధ్యాయులు నిరసన గళం విప్పారు. ఉద్యోగులకు పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని వివిధ ఉపాధ్యాయ సంఘాలకు చెందిన నాయకురాళ్లు స్థానిక ఎమ్మార్సీ సెంటరు వద్ద ధర్నా నిర్వహించారు. యూటీఎఫ్ మండల అధ్యక్షురాలు ఎం.సాయిలక్ష్మి, నాయకులు లలితాదేవి, భువనేశ్వరి, ఏపీటీఎఫ్ నాయకురాళ్లు జయలక్ష్మి, వెంకటలక్ష్మి, విజయ కుమారి, ఎస్టీయూ నాయకురాలు పార్వతీ ఆధ్వర్యంలో మండలంలోని ఉపాధ్యాయినులు, యూపీఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉద్యోగులకు నష్టం కలిగించే పెన్షన్ స్కీమును అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించటం దారుణమని ఉపాధ్యాయినులు మండిపడ్డారు. పాత పెన్షన్ విధానమే ఉద్యోగులకు ఆమోదయోగ్యమని స్పష్టం చేశారు.

ట్రై సైకిల్ అందజేత



శ్రీనుకు ట్రై సైకిల్ అందజేస్తున్న వినోద్

ముదినేపల్లి, ఆగస్టు 29 : రెండు కాళ్లు పని చేయక కదల లేని స్థితిలో ఉన్న కైకలూరు జాన్‌పేటకు చెందిన దాసరి శ్రీనుకు నియోజకవర్గ టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ ఉదారతతో ట్రై సైకిల్‌ను అందజేశారు. జాన్‌పేట టీడీపీ నాయకుడు ఆర్.సునీల్ ఇబ్బందులు పడుతున్న శ్రీను పరిస్థితి చెప్పగా స్పందించిన వినోద్ తన ఆధ్వర్యంలోని బి.బాలసాయి ట్రస్టు ద్వారా ట్రై సైకిల్‌ను బుధవారం రాత్రి అందజేశారు.

మృతుని కుటుంబానికి రూ.50 వేలు అందజేత



మృతుని కుటుంబానికి చెక్కు అందజేస్తున్న రామచంద్రరావు

చాట్రాయి, ఆగస్టు 29: మండలంలోని చీపురుగూడెం పాల సహకార సంఘానికి పాలుపోస్తున్న తాతినేని రాఘవయ్య ఇటీవల మృతి చెందగా, కృష్ణా మిల్క్ యూనియన్ క్షీర బంధు పథకం కింద రూ.50 వేల చెక్కును గురువారం సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు మృతుడి కుమారుడు సత్యనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, పాడి రైతులు పాల్గొన్నారు.

పౌర హక్కులకు భంగం కలిగించవద్దు



సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

కలిదిండి, ఆగస్టు 29 : పౌర హక్కులకు భంగం కలుగకుండా చూడాలని తహసీల్దార్ రామకృష్ణ, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటరత్నం అన్నారు. బర్రెంకుల గరువులో గురువారం పౌర హక్కుల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల వివక్ష, పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులను ఎవరైనా చిన్నచూపు చూస్తే తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామన్నారు. గ్రూపు దేవాలయాల ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, వీఆర్వో జయరాజు, కార్యదర్శి శివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆడ పిల్లలను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు



సదస్సులో మాట్లాడుతున్న వినీత

నూజివీడు, ఆగస్టు 29: ఆడ పిల్లలను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన శిక్షలను ఎదుర్కోవాల్సి ఉంటుందని, మహిళా కమిషన్ గౌరవ సభ్యులు వి.వినీత అన్నారు. నూజివీడు ఎస్ఆర్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో 100 రోజులు మిషన్ శక్తి అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా నూజివీడు ఆర్డీవో వై.భవానిశంకరి ముఖ్య అతిథిగా హాజరు కాగా ఆడపిల్లల విషయంలో ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే సదరు విషయాన్ని 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించగా, అనంతరం వ్యవహారిక భాషా దినోత్సవం, క్రీడాది నోత్సవాలను నిర్వహించారు. డీవైఈవో సేవియ్యా, సీడీపీవో షేక్ నూరాని, ఏసీడీపీవో నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు



కాట్రేనిపాడులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఇవాంజలి

ముసునూరు, ఆగస్టు 29: కిషోర బాల బాలికల్లో వచ్చే రక్తహీనత నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు వైద్యాధికారిణి డాక్టర్ షకీనా ఇవాంజలి అన్నారు. గురువారం కాట్రేనిపాడు, రమణక్కపేట జడ్పీపాఠశాలలో పౌష్టికాహారం, ఆరోగ్య సమస్యలు, శుభ్రత పరిశుభ్రత తదితర అంశాలపై కిషోర బాలికలకు వైద్యులు ఇవాంజలి, డాక్టర్ కరిముల్లాలు అవగాహన కల్పించారు. రక్తహీనత నివారణకు ట్యాబ్‌లెట్‌ను అందజేశారు. హెచ్ఎంలు అనురాధ, రామకృష్ణారావులు పాల్గొన్నారు. అలాగే ముసునూరు ఏసీకాలనీలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి, కాలనీవాసులకు డాక్టర్ ఇవాంజలి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

తెలుగు భాషను నిర్లక్ష్యం చేయవద్దు

- ఘనంగా మాతృ భాషా దినోత్సవం
- గిడుగు రామ్మూర్తికి ఘన నివాళి





నూజివీడు, కైకలూరులో వివిధ వేషధారణలలో విద్యార్థులు

చాట్రాయి, ఆగస్టు 29: తెలుగు భాషను మర్చిపోవద్దని పోలవరం కోనేరు కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఆర్.నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పోలవరం, తుమ్మగూడెం పాఠశాలల్లో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు తెలుగుతల్లి, గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తుమ్మగూడెం హెచ్ఎం వెంకట్రావు విద్యార్థులు పాల్గొన్నారు.

● ముదినేపల్లి : తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా పెయ్యేరు ప్రాథమిక పాఠశాలలో గిడుగు రామ్మూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బేతాళ రాజేంద్ర ప్రసాద్, ఎస్ఎంసీ చైర్మన్ ముస్నీసా, మాజీ చైర్మన్ నాగూర్‌బీ రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

● నూజివీడు టౌన్ : తెలుగు వ్యవహారిక భాషా దినోత్సవాన్ని నూజివీడు త్రివిధ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు షణ్ముక్, కుషాల్, రుద్రిక్, యశ్వంత్, మోహిత్ సాయి వివిధ వేషధారణలతో అలరించారు.

● కలిదిండి : స్థానిక శాఖా గ్రంథాలయంలో తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా గ్రంథాలయాధికారి జె.రమేష్, సాహితీ మిత్రులు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు ఉపాధ్యాయురాలు పద్మలత, ప్రముఖ రంగస్థల కళాకారులు దుగ్గిరాల పరమేశ్వరరావు, గంగామణి దంపతులను సత్కరించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. గ్రూపు దేవాలయాల ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, సాహితీ మిత్రులు పాల్గొన్నారు.

● కైకలూరు : స్థానిక జాగృతి స్కూల్లో విద్యార్థులు శ్రీకృష్ణా దేవరాయలు, అష్టదిగ్గజ కవుల వేషధారణలతో అలరించారు. ప్రిన్సిపాల్ జయకిషోర్‌బాబు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

● మండవల్లి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్ఎం పీవీఎస్ఎస్‌జీ ప్రసాద్ ఆధ్వర్యంలో వివిధ సబ్జెక్టుల అధ్యాపకులు, విద్యార్థులకు వ్యాసరచన వకృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. జూనియర్ కళాశాల విద్యార్థులు క్రీడా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. చింతపాడులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిషోర్ బాలికల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆరోగ్య శాఖ విస్తరణ అధికారి టీఎస్ బాబు లోకుముడి హైస్కూల్ హెచ్ఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. చింతపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

● ఆగిరిపల్లి : తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఆగిరిపల్లి మండలం ఎంపీయూపీ, చొప్పరమెట్ల స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులను వారి జీవిత చరిత్రల గురించి వివరించి ఈ రోజంతా తెలుగులోనే మాట్లాడాలని సూచించారు. మధ్యాహ్నం ఆటల పోటీలు నిర్వహించారు. ఎస్ఎంసీ చైర్మన్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు సిద్ధం చేయండి

ఆర్డీవో భవానిశంకరి

ముసునూరు, ఆగస్టు 29: ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సొసైటీల్లో ఉన్న కొనుగోలు కేంద్రాల్లో సర్వం సిద్ధం చేయాలని నూజివీడు ఆర్డీవో భవాని శంకరి ఆదేశించారు. ముసునూరు, చెక్కపల్లి సొసైటీల్లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆమె పరిశీలించారు. గతేడాది జరిగిన ధాన్యం విక్రయాలకు సంబంధించిన రికార్డులను, తేమ శాతం మిషన్, సంచులు, రైతుల వివరాలను పొందుపర్చే కంప్యూటర్లు, బయోమెట్రిక్ డివైజర్ తదితర పరికరాలు, వసతులను ఆమె పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ అక్టోబరు నుంచి ధాన్యాన్ని కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలన్నారు. రైతుల వివరాలను ఆన్‌లైన్ చేయడం తోపాటు రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదు వచ్చిన సహించేదిలేదని ఆర్డీవో హెచ్చరించారు. నూజివీడు పౌరస రఫరాల డీటీ జి.వెంకటేశ్వరావు, ఏఈవో రామకృష్ణ, వీఆర్వో మస్తాన్‌రావు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై విచారణకు ఆదేశం



చెక్కపల్లి రైతు సేవా కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో

రమణక్కపేటలో గత ఐదేళ్లలో జరిగిన ఉపాధి హామీ పనులపై సమగ్ర విచారణ చేసి, నివేదికను అందజేయాలని ఏపీవో రోజ్‌లీల, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావులను నూజివీడు ఆర్డీవో భవానిశంకరి ఆదేశించారు. ఇటీవల జరిగిన ఉపాధి హామీ గ్రామ సభలో మంత్రి పార్థసారథికి ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగాయని, విచారణ జరిపించాలని కూలీలు, స్థానికులు వినత పత్రం అందించగా, ఏస్సీ కాలనీలో సమస్యలపై కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. వీటిపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆర్డీవోను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు గురువారం ఆర్డీవో రమణక్కపేట ఏస్సీకాలనీలో తాగునీరు, డ్రైనేజీల సమస్యలను ఆమె క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సమస్యలను తక్షణమే పరిష్కారించాలని కార్యదర్శి ప్రసాద్‌ను ఆమె ఆదేశించారు. అనంతరం సచివాలయంలో ఉపాధి సిబ్బందితో ఆర్డీవో సమావేశం నిర్వహించి, రికార్డులను పరిశీలించారు. కూలీలకు వందరోజులు పని కల్పించకుండా, పాత పనులను వదిలివేసి, కొత్త పనులకు తీర్మానాలు చేయడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలో లేనివారికి, పనులకు రాని వారికి వేతనాలు ఎందుకు చెల్లించారని ఆమె మండిపడ్డారు. పనిచేసి వేతనాలు రాని కూలీలను వివరాలను ఆమె నమోదు చేసుకున్నారు. ఈ గ్రామంలో గత ఐదేళ్లలో జరిగిన ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగిన ట్లు తెలుస్తోందని, వీటిపై ఈవోపీఆర్డీ, ఏపీవోలు విచారణ చేసి, నివేదిక అందించాలని ఆర్డీవో ఆదేశించారు. అనంతరం ఉపాధి నిధులతో గ్రామంలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై సమీక్షించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



కైకలూరులో క్విజ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులు



బాస్కెట్ బాల్ క్రీడా సామగ్రితో ముదినేపల్లి విద్యార్థులు



మర్లపాలెం హైస్కూల్లో విద్యార్థుల ఆటల పోటీలు

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

చాట్రాయి, ఆగస్టు 29: విద్యార్థులు క్రీడల్లోనూ రాణిస్తే జీవితంలో కూడా రాణించవచ్చునని మర్లపాలెం హైస్కూల్ హెచ్ఎం సీహెచ్ రఘు, వ్యాయామ ఉపాధ్యాయుడు సతీష్‌కుమార్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని మర్లపాలెం జడ్పీ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పోలవరం కోనేరు కాలనీ ప్రాథమిక పాఠశాలలో, తుమ్మగూడెం ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు.

● కలిదిండి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, సుగుణ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యకరమైన జీవన శైలిని పెంపొందించుకోవటానికి ఫిట్‌గా ఉండటానికి క్రీడలు దోహదపడతాయని ప్రిన్సిపాల్ జె.త్రినాథ్ అన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ముదినేపల్లి : గురజ హైస్కూల్‌లో హెచ్ఎం జి.కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం తెలుగుభాషా దినోత్సవం నిర్వహించి గిడుగు రామ్మూర్తికి నివాళులర్పించారు.

● కైకలూరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యువ చైతన్య సమైఖ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ డి.రామారావు, ఎస్సై ఆర్.సత్యనారాయణ, సంస్థ సభ్యులు ఎం.సత్యనారాయణ, ఎం.వంశీ పాల్గొన్నారు.

● ముసునూరు : రమణక్కపేట జడ్పీపాఠశాల విద్యార్థులకు రూ.40 వేలు విలువగల బాస్కెట్ బాల్, వాలీబాల్, స్కిపింగ్ రోప్స్ తదితర క్రీడా సామగ్రిని గురువారం చుక్కపల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ సుధా వితరణగా అందజేశారు.

నందమూరి హరికృష్ణకు ఘన నివాళి



హరికృష్ణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ముద్దరబోయిన

నూజివీడు టౌన్, ఆగస్టు 29: చైతన్య రథసారథిగా నాడు ఎన్టీఆర్‌కు అండగా రాష్ట్ర విభజన సమయంలో రాజ్యసభలో ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని నిలిపిన వ్యక్తిగా నందమూరి హరికృష్ణ చిరస్మరణీయుడని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడులోని ఆయన కార్యాలయంలో నందమూరి హరికృష్ణ వర్ధంతిని పురష్కరించుకొని ఆయన చిత్ర పటానికి ముద్దరబోయిన పూలమాల వేసి నివాళులర్పించారు. ముసునూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కందుల పిచ్చయ్య, తాలం వెంకటేశ్వరరావు, చిమటా శ్రీనివాసరావు, బాణావతు రవి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

● ముసునూరు : చైతన్య రథసారథి, రాజ్యసభలో ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన నందమూరి హరికృష్ణ వర్ధంతిని టీడీపీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. సూరేపల్లిలో టీడీపీ నాయకులు కొక్కిరపాటి శోభనాద్రి, అముదాల రంజిత్‌కుమార్‌లు హరికృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే చెక్కపల్లి, అక్కిరెడ్డిగూడెం, రమణక్కపేట, లోపూడి తదితర గ్రామాల్లో హరికృష్ణ వర్ధంతి వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించి, టీడీపీ బలోపేతానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు.

ఘనంగా గంగానమ్మ జాతర



కైకలూరులో గంగానమ్మని ఊరేగిస్తున్న భక్తులు

మండవల్లి, ఆగస్టు 29: మండవల్లిలోని యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం గంగనమ్మ జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యువత చిందుల కేరింతలు మధ్య డప్పులు వాయిద్యాలతో మండవల్లి ప్రధాన వీధుల్లో అమ్మవారి జాతర నిర్వహించారు. దేవతామూర్తుల ప్రతిభంగా పూనకం వచ్చిన మహిళలు ప్రతీ ఇంట సందర్శించి ఆశీస్సులు ఇస్తూ గంగానమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కైకలూరులో గంగానమ్మ జాతర ప్రారంభం

కైకలూరు : గంగానమ్మ జాతర మహోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. బైపాస్‌రోడ్డులోని గంగానమ్మ అమ్మవారికి విశేషపూజలను నిర్వహించి ఊరేగింపు చేశారు. ఆదివారం వరకు జాతర నిర్వహించనున్నారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. మహిళ మృతి

ఇద్దరికి తీవ్ర గాయాలు





మృతి చెందిన దాట్ల దుర్గాదేవి, తీవ్రంగా గాయపడిన దాట్ల విశ్వనాధరాజు

కైకలూరు ఆగస్టు 29: పామర్రు-కత్తిపూడి జాతీయ రహదారిలో ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొన్న సంఘటనలో ఓ మహిళ మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కైకలూరు మండలం శింగాపురంలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. భీమవరం నుంచి ఏలూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు కైకలూరు నుంచి ఆకివీడు వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. బస్సు డ్రైవర్ రోడ్డుపై ఉన్న గోతిని తప్పించబోయి ఆటోను పట్టించి కొద్ది దూరం ఈడ్చుకుపోయాడు. ఆటో డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు ప్రయాణికులు ఆటోలో ప్రయాణిస్తున్నారు. ఆ ముగ్గురు పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం చెరుకుమిల్లికి చెందిన దాట్ల విశ్వనాధరాజు, దాట్ల దుర్గాదేవి, దాట్ల అప్పలరాజు కైకలూరులో టైల్స్ కొనేందుకు వచ్చారు. వాటిని కొనుగోలు చేసి తిరిగి ఆటోలో వెళుతుండగా మార్గ మధ్యలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో 108 ద్వారా స్థానికులు కైకలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి ఏలూరు ప్రభుత్వాస్పత్రికి పంపించగా అక్కడ చికిత్స పొందుతూ దుర్గాదేవి(63) మృతి చెందింది. ఆమె భర్త అయిన దాట్ల విశ్వనాధరాజు పరిస్థితి విషమంగా ఉండడంతో విజయవాడ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి క్షత గాత్రులకు వైద్యసహాయం అందించారు. ఈ సంఘటనపై మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గణనాథులు సిద్ధం



వినాయక చవితికి పూజలందుకొనేందుకు గణనాథులు సిద్ధమయ్యారు. సుమారు రెండు అడుగుల నుంచి 15 అడుగులకుపైగా ఉన్న వీటిని కలిదిండి సెంటర్‌లోను, రాష్ట్ర రహదారి పక్కన పెద్దింటమ్మ ఆలయ సమీపంలో విక్రయిస్తున్నారు. సైజును బట్టి విగ్రహాలకు రూ.25 వేల వరకు ధర పలుకుతుంది. - కలిదిండి

నేడు వన మహోత్సవం

● నూజివీడు/ఆగిరిపల్లి/కలిదిండి, ఆగస్టు 29 : వన మహోత్సవాన్ని శుక్రవారం బత్తుల వారిగూడెంలో నిర్వహిస్తున్నారు. మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ పుట్టా మహేష్, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నట్లు, జిల్లా అటవీ శాఖ అధికారి రవీంద్ర దామా తెలిపారు. ఆగిరిపల్లి జడ్పీహెచ్ స్కూల్ ఆవరణలో 30వ తేదీ సర్పంచ్ చవటపల్లి లక్ష్మివిక్టర్ అధ్యక్షతన వనమహోత్సవం నిర్వహిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి బి.ప్రసాద్ తెలిపారు. వన మహోత్సవం పురస్కరించుకుని 4,600 మొక్కలను పంపిణీకి సిద్ధం చేశామని కలిదిండి ఎంపీడీవో దినతేజ్ తెలిపారు.

ఒక రోజు ముందే పింఛన్ల పంపిణీ

కైకలూరు/ఆగిరిపల్లి/చాట్రాయి, ఆగస్టు 29: సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం రావడంతో ఒక రోజు ముందుగానే శనివారం పింఛన్ల పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవోలు ఉమామహేశ్వరరావు, పి.శంకర్‌రావు, దుర్గాప్రసాద్ తెలిపారు. పింఛనుదారులు ఇళ్ల వద్దే ఉండాలని కోరారు.

పీహెచ్‌సీలో సౌకర్యాలు కల్పించాలి

ముదినేపల్లి, ఆగస్టు 29 : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ఆయన అధ్యక్షతన గురువారం జరిగిన కమిటీ సమావేశంలో ఆస్పత్రి అభివృద్ధికి, సదుపాయాల కల్పనకు దాతలు కూడా ముందుకు రావాలని కోరారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శాంతిశ్రీ, మండల పరిషత్ ఏవో రమణబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉత్తమ ఏఎన్ఎంగా స్వాతంత్ర దినోత్సవ పురస్కారం అందుకున్న ముదినేపల్లి-2 ఏఎన్ఎం ఎలీనా రాణిని ఎంపీపీ సత్కరించారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

ముదినేపల్లి, ఆగస్టు 29 : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ గురువారం మండలంలోని ఉపాధ్యాయులకు స్థానిక ఎమ్మార్సీ వద్ద ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను ఎంఈవో కె.నరేష్ కుమార్ ప్రారంభించారు. మహిళా ఉపాధ్యాయులకు కబడ్డీ, టెన్నికాయిట్, చెస్, మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహించారు. ఉపాధ్యాయినుల కబడ్డీ పోటీలు రసవత్తరంగా జరిగాయి. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయినుల ఆటలు ఆసక్తిని కలిగించాయి.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నూజివీడు టౌన్, ఆగస్టు 29: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నూజివీడు పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి సూచించారు. ఎమ్మార్ అప్పారావు పీజీ కళాశాలలో మత్తు పదార్థాలు తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు అమ్మినా, కలిగి ఉన్నా చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తామన్నారు. ఉద్యోగ, ఉపాధి కూడా దూరం అవుతుందని, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలసిన జనసేన నాయకులు

ముదినేపల్లి, ఆగస్టు 29 : తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సుభానీని జనసేన నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలసి సత్కరించి అభినందించారు. పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి వేల్పూరి నానాజీ, నాయకులు తణుకుల రవితేజ, భూపాల నాని, సత్యవోలు కళ్యాణ్, లంకపల్లి నాని, వాలిశెట్టి బాబీ, మల్లంపల్లి వీరబాబు, కురిచేటి నాగేంద్ర తదితరులు తహసీల్దార్‌ను కలసి మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కూడా సహకరించాలని కోరారు. సెప్టెంబరు 2న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహిస్తున్న మొక్కలు నాటే కార్యక్రమం, ఇతర సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని తహసీల్దార్‌ను జనసేన నాయకులు ఆహ్వానించారు.

నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి



ఆగిరిపల్లిలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

నూజివీడు టౌన్, ఆగస్టు 29: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నీటి నిల్వలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని దిగవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.శ్రీనివాస్ అన్నారు. ఓగిరాలతండా, లైయన్ తండాలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మురుగు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టాలన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● ఆగిరిపల్లి : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆగిరిపల్లి గ్రామంలో ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జాస్తి జగన్మోహన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు అవసరమైన రక్తపరీక్షలు చేసి అవసరమైన మందులు ఇవ్వడం జరిగింది. అనంతరం గ్రామంలోని ప్రజలకు సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తీసుకునే జాగ్రత్తలు గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారిణి దుర్గాభవాని, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మంద కృష్ణను అంటే ఊరుకోము

ఆగిరిపల్లి, ఆగస్టు 29: మాదిగ సామాజిక వర్గ నాయకుడు ఎస్సీ రిజర్వేషన్ కోసం 30 సంవత్సరాలుగా పోరాడిన మంద కృష్ణమాదిగను తక్కువ చేసి మాట్లాడితే తాము ఊరుకోమని ఆగిరిపల్లి ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు కంబాల ప్రదీప్, నల్లమోతు కాంచనరావు అన్నారు. నూజివీడు మాల సామాజికవర్గనేత నత్తా నాగేశ్వరరావు, మందకృష్ణ మాదిగను తనస్థాయి మర్చిపోయి మాట్లాడటం అంత ఉన్నతమైన వ్యక్తిని నాలుక కోస్తా అనేటువంటి స్థాయి తక్కువ మాటలు అనటం మంచిది కాదని మాల, మాదిగలు సోదర భావంతో మెలగాలని హితవు చెప్పారు. తాను మాట్లాడిన మాటలు వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మంచి నీటి బోరు పనులు ప్రారంభం

ముసునూరు. ఆగస్టు 29: గోపవరం ఏస్సీకాలనీలోని గ్రామదేవత గోంతేనమ్మ తల్లి ఆలయంలో గురువారం మంచి నీటి బోరు పనులను టీడీపీ నాయకులు ప్రారంభించారు. వన సంరక్షణ నిధులతో మంచినీటి బోరు వేస్తున్నట్లు గ్రామ పార్టీ అధ్యక్షులు బొల్లినేని బుజ్జియ్య, వన సంరక్షణ సమితి చైర్మెన్ గుడిమెల్లి జయరాజు తెలిపారు. టీడీపీ నాయకులు నందిగం దామోదరరావు, వడ్లపట్ల బుజ్జిబాబు, పర్వతనేని శ్రీనివాసరావు, యువనేత ఉప్పాలపాటి గణేష్, నందిగం వాసు, కంచర్ల రాంబాబు, మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతిపై అనుమానాస్పద కేసు నమోదు

చాట్రాయి, ఆగస్టు 29: మండలంలోని తుమ్మగూడెం శివారు టి.గుడిపాడులో కొమ్ము స్వాతి(28) గురువారం మృతి చెందగా, మృతురాలి అన్న వినోద్ ఫిర్యాదుపై పోలీసులు అనుమానస్పద మృతి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పర్వతాపురం గ్రామానికి చెందిన స్వాతికి, టి.గుడిపాడుకు నివాసి కొమ్ము పాపారావుకు ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. పిల్లలు లేరు. ఇటీవల స్వాతి అనారోగ్యానికి గురి కాగా మంగళగిరి ప్రైవేటు హాస్పటల్‌లో చేర్చి చికిత్స అందిస్తుండగా మృతి చెందింది. కేసు నమోదు చేసి శవ పంచనామా నిర్వహించామని, శుక్రవారం పోస్టుమార్టం జరుగుతుందని ఎస్సై రామకృష్ణ చెప్పారు.